RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 338 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 డిసెంబర్ 2024 ఆదివారం పేజీలు : 4

## విమానప్రయాణికులకు ఎలర్ట్..

### క్యాబిన్ లగేజీ నిబంధనల్లో మార్పు!

విమానప్రయాణం మరింత సౌకర్యవంతంగా చేసే దిశగా బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) హ్యాండ్ లగేజీకి సంబంధించి కీలక మార్పు చేసింది. దీని ప్రకారం, వచ్చే నెల నుంచీ ప్రయాణికులు విమానంలోకి తమ వెంట ఒక క్యాబిన్ బ్యాగును మాత్రమే తీసుకెళ్లాలి. దేశీయ ప్రయాణికులతో పాటు విదేశాలకు వెళ్లే వారికీ ఈ నిబంధన వర్తిస్తుందని బీసీఏఎస్ పేర్కొంది. విమానప్రయాణికుల సంఖ్య నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలు మరింత సులభంగా సాగేందుకు ప్రభుత్వం ఈ నిబంధన ప్రవేశపెట్టినట్టు బీసీఏఎస్ వెల్లడించింది. ఈ చర్యతో ఎయిర్‌పోర్టుల్లో సెక్యూరిటీ చెక్ పాయింట్ల వద్ద రద్దీ తగ్గి కార్యకలాపాలు మరింత వేగంగా సాగుతాయని బీసీఏఎస్ చెబుతోంది.

# మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి కన్నీటి వీడ్కోలు

## పార్థివ దేహానికి నివాళులర్పించిన దేశ, విదేశ రాజకీయవేత్తలు, మేధావులు





ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అంత్యక్రియలు ముగిశాయి. దేశ రాజధానిలోని నిగమ్ బోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అధికార లాంఛనాలంతో ఈ కార్యక్రమం కొనసాగింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 92 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వరుసగా రెండుసార్లు ప్రధానమంత్రిగా పని చేశారాయన. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ఆ శాఖ మంత్రిగా పని చేశారాయన. ఆర్థిక వ్యవస్థకు జీవం పోశారు. ఈ ఉదయం కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అంతిమయాత్ర ఆరంభమైంది. మిలటరీ వాహనంపై నిగమ్ బోధ్ ఘాట్‌కు పార్థివదేహాన్ని అధికార, సైనిక లాంఛనాలతో తీసుకొచ్చారు. అక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాళి అర్పించారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి మనీష్ గోబిన్.. ఆయనకు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సహా పలువురు మంత్రులు, అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరైన వారిలో ఉన్నారు.

**సిక్ సంప్రదాయంలో మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అంత్యక్రియలు**

... ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అంత్యక్రియలు ఆరంభం అయ్యాయి. దేశ రాజధానిలోని నిగమ్ బోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియలను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అధికార లాంచనాలంతో ఈ కార్యక్రమం కొనసాగింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 92 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వరుసగా రెండుసార్లు ప్రధానమంత్రిగా పని చేశారాయన. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ఆ శాఖ మంత్రిగా పని చేశారాయన. ఆర్థిక వ్యవస్థకు జీవం పోశారు. ఈ ఉదయం కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అంతిమయాత్ర ఆరంభమైంది. మిలటరీ వాహనంపై నిగమ్ బోధ్ ఘాట్‌కు పార్థివదేహాన్ని అధికార, సైనిక లాంఛనాలతో తీసుకొచ్చారు. అక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాళి అర్పించారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా.. తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. చివరిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధాతప్త హృదయంతో నివాళి అర్పించారు. సెల్యూట్ చేశారు. ఆ సమయంలో అందరూ లేచి నిల్చుని మౌనం పాటించారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి మనీష్ గోబిన్.. ఆయనకు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సహా పలువురు మంత్రులు, అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరైన వారిలో ఉన్నారు. ద్రౌపది ముర్ము నివాళి అర్పించిన అనంతరం మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని చితిపైకి తీసుకొచ్చారు. సిక్కుల సంప్రదాయంలో అంత్యక్రియలను చేపట్టారు. ఆ సమయంలో సిక్ పెద్దలు సంప్రదాయబద్ధమైన కృపాణులను ధరించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ప్రార్థనలను నిర్వహించారు.



## సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం

హైదరాబాద్: సంక్రాంతి నుంచి రైతు భరోసా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రైతు భరోసాపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సమీక్ష నిర్వహించారు. రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా సాగు విస్తీర్ణం గుర్తించటంపై చర్చించారు. సాగు విస్తీర్ణం అంచనా వేయగల కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపారు. "సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం ఇవ్వడం మా ఉద్దేశం. వ్యవసాయశాఖ అధికారుల వద్ద రైతుల పేర్లు నమోదు జరుగుతోంది. పథకం అమలులో కచ్చితత్వం కోసం ఉపగ్రహ డేటా వినియోగిస్తాం. గ్రామాలు, సర్వే నెంబర్ల వారీగా సాగు వివరాలు సేకరిస్తాం" అని మంత్రి తెలిపారు.




## మందుబాబులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్..!

హైదరాబాద్ : తెలంగాణలో మందుబాబులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కొత్త సంవత్సర వేడుకలకు సిద్ధమవుతున్న తెలంగాణలో మద్యం షాపుల్ని అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 31న నిర్వహించే కొత్త సంవత్సల వేడుకల సందర్భంగా మద్యం అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మద్యం షాపులతో పాటు బార్లు, రెస్టారెంట్లు కూడా అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంచనున్నారు. తెలంగాణలో కొత్త సంవత్సర వేడుకల్ని ధూంధాంగా జరుపుకునేందుకు మందుబాబులు సిద్దమవుతున్నారు. వీరికి ఎక్సైజ్ శాఖ శుభవార్త అందించింది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 31న అర్ధరాత్రి వరకూ మద్యం షాపుల్ని తెరిచే ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బార్లు, రెస్టారెంట్లు రాత్రి ఒంటిగంట దాకా వ్యాపారం చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు, ఈవెంట్లకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహించే స్పెషల్ ఈవెంట్లకు పలు షరతులతో అనుమతులు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే పార్టీలు, పబ్ లలో డ్రగ్స్ వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు షరతు పెట్టింది. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించే ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగించకుండా చూడాలని అధికారులకు కూడా ఆదేశాలు ఇచ్చింది. డిసెంబర్ 31న అర్ధరాత్రి వరకూ వైన్ షాపులు తెరిచి ఉంచేందుకు అనుమతినివ్వడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏడాది పొడవునా జరిగే వ్యాపారంలో మూడో, నాలుగో వంతు వ్యాపారం కొత్త ఏడాది సందర్భంగా జరుగుతుందని తెలుస్తోంది.




## అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరింత దూకుడు

హైదరాబాద్: కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టంచేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. FTL నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ఇవాళ(శనివారం) హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. ORR లోపల.. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. FTL, బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ FM రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్దరణ చేస్తున్నామని చెప్పారు. డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ORR వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు.

**ఎఫ్‌టీఎల్ నిర్ధారణ..** "హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. ORR వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది. 1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపారక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి" అని రంగనాథ్ పేర్కొన్నారు.

**ఆక్రమణలపై చర్యలు..** "27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్దరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం" అని రంగనాథ్ వెల్లడించారు.

# సంపాదకీయం

## చకచకా అమరావతి

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల క్రితం నిలిచిన నిర్మాణ పనులు మళ్లీ మొదలుపెట్టేందుకు టెండర్లు పిలుస్తున్న ప్రభుత్వం.. పనులు చేపట్టేందుకు అనువుగా పునాదుల్లో నిలిచిన నీళ్లను తోడే ప్రక్రియను స్టార్ట్ చేసింది. గత రెండు రోజులుగా ఐకానిక్ టవర్ల పునాదుల్లో నిలిచిన నీటిని భారీ పంపు సెట్లతో తోడుతున్నారు. 2019కి ముందు తాత్కాలిక భవనాలను నిర్మించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు రాజధానిలో శాశ్వత భవనాల నిర్మాణానికి చకచకా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టులు తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వంలో శాశ్వత భవన నిర్మాణాలు కొనసాగించి ఉంటే ఈ పాటికే పూర్తయ్యేవి. కానీ, వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతిలో శాశ్వత భవనాల నిర్మాణాన్ని నిలిపేసింది. జూన్ లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ రాజధాని పనులపై ఫోకస్ చేసింది. ప్రపంచ బ్యాంకుతోపాటు ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం తీసుకుంది. ఈ నిధులతో జనవరి నుంచి పనులు మొదలుపెట్టాల్సివుంది. ముందుగా రాజధానిలోని సచివాలయం కోసం నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ పనులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో గతంలో ర్యాఫ్ట్ ఫౌండేషన్ వేసిన ఐకానిక్ టవర్ల వద్ద నిలిచిన నీటిని తోడుతున్నారు. అమరావతిలో శాశ్వత సచివాలయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని భావించిన టీడీపీ ప్రభుత్వం ఐదు టవర్లు నిర్మించాలని ప్రతిపాదించింది. ఒక్కో టవర్లో 40 నుంచి 50 అంతస్తులు ఉండేలా డిజైన్ చేసింది. ఈ పనులకు 2018 డిసెంబరు 27న సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. డయా (రెండు వరుసల) గ్రిడ్ పద్ధతిలో ఐదు టవర్లను నిర్మించాలని అప్పట్లో ప్లాన్ చేశారు. అసెంబ్లీ భవన ప్రాంగణంలో 69.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ టవర్ల నిర్మాణానికి రూ.4,890 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మళ్లీ ఆరేళ్ల తర్వాత సరిగ్గా అదే సమయానికి ఇప్పుడు ముందస్తు పనులు మొదలు కావడం విశేషంగా చెబుతున్నారు. భారీ భవనాలకు కీలకమైన పునాదుల నిర్మాణాన్ని అప్పట్లో రికార్డు సమయంలో పూర్తి చేశారు. మూడు రోజుల్లో, అంటే 72 గంటల్లో 10,816 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, నిర్మాణ సంస్థ అయిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) ఈ పనిని 66 గంటల్లోనే పూర్తిచేసింది. ఒక కార్యాలయం కోసం దేశంలో నిర్మించిన అతిపెద్ద రాఫ్ట్‌గా ఇది రికార్డులకెక్కింది. 13 అడుగుల లోతులో వేసిన ఈ ర్యాఫ్ట్ ఫౌండేషన్‌కు ప్రపంచ ప్రఖ్యాత ఫోస్టర్ అండ్ పార్టనర్ సంస్థ డిజైన్ చేసింది. షాపూర్జీ- పల్లోంజి సంస్థ ఆ రికార్డును సాధించింది. అయితే గత ఐదేళ్లు పనులు ముందుకు కదలకపోవడంతో ఈ ప్రఖ్యాత నిర్మాణం నీళ్లలో మునిగిపోయింది. ఐఐటీ హైదరాబాద్ బృందం ఈ ఏడాది ఆగస్టులో నీటి లోపల ఉన్న పునాదులను పరిశీలించి పనులు కొనసాగించొచ్చని నివేదిక సమర్పించింది. దీంతో మళ్లీ టెండర్లు పిలిచిన ప్రభుత్వం మరో పక్క నుంచి పనులు చేపట్టేందుకు అనువుగా నీటిని తోడుతోంది. దీంతో కొద్ది రోజుల్లో అమరావతి పనుల్లో పురోగతి ఉంటుందని భావిస్తున్నారు.



## అలియాబాద్ రత్నాలయంలో భరతనాట్య ప్రదర్శన

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రత్నాలయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భరతనాట్య ప్రదర్శనను కళాకారులు నిర్వహించి భక్తులను అలరించారు. శనివారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని శ్రీ రత్నాలయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నగరంలోని రామంతాపూర్ పరిధిలోని శ్రీ అంజన నాట్యాలయం విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనను నిర్వహించారు. మార్గశిర మాసం శని త్రయోదశి పురస్కరించుకొని ఆ నాట్యాలయం కు చెందిన 14 మంది కళాకారులు నాట్య ప్రదర్శన చేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు పెద్ద ఎత్తున ఈ నాట్య ప్రదర్శను తిలకించి తరించారు. వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి నాట్య ప్రదర్శనను తిలకించారు.



## పేదల పాలిటి పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి... ఎమ్మెల్యే మల్లారెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పెన్నిదని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడు చింతలపల్లి మండలం జక్కం గూడ గ్రామానికి చెందిన ర్యాకల నరసింహ, బుద్ధి యాదగిరిలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జగ్గంగూడ గ్రామం లోని ర్యాకల నర్సింహా రూ. 60,000 ల చెక్కు, బుద్ధి యాదగిరి కి రూ. 51,000 ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మల్లారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ శామీర్ పేట మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు హరి మోహన్ రెడ్డి, నాగరాజు గుప్తా, జంగా రెడ్డి, అనిల్ రెడ్డి, వంగ వెంకట్ రెడ్డి, సుధాకర్, మహేష్, వెంకటేష్, యాదగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి చేతలు గడప దాటడం లేదు

మాటల ముఖ్యమంత్రి చేతల ముఖ్యమంత్రి కాదు రేవంత్ రెడ్డి

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు





సిద్దిపేట నాసరపుర బ్రిడ్జి స్కూల్లో విద్యార్థులకు స్వెటర్స్ దుప్పట్లు పంపిణీ చేసిన హరీష్ రావు మాట్లాడుతూ అసెంబ్లీ లో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణం- ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదు...- మహా లక్ష్మి, తులం బంగారం ఎటు పొయాయ్.ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారాముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదాతక్షణమే అన్నిచోట్ల మిస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాఅన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదు ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లి విడుదల చేయడం లేదు. 1300 పెంచిన మెస్ ఛార్జ్ లు ఇప్పటికి అమలు కాలేదు.. అర్బన్ రెసిడెన్షియల్ లో 1050 మెస్ ఛార్జ్ లు ఇస్తున్నారు.- 1 నుండి 7 తరగతి వరకు 1300, 8 వ తరగతి కి 1500 మెస్ ఛార్జ్ లు ఇవ్వాలి..- కాస్మోటిక్ ఛార్జ్ లు ఇంకా 100 రూపాయలు ఇస్తున్నారు..150రూపాయలు ఇవ్వాలి ఇది 4నెలల నుండి పెండింగ్ ఉన్నాయి.- తల్లి తండ్రులు లేని రెసిడెన్షియల్ స్కూల్స్ లో ప్రభుత్వం మరింత బాధ్యత ఉండాలి.- విద్యా శాఖ మంత్రి లేడు.. విద్యా శాఖ ని దగ్గర నే ఉంది.- సాంఘిక, గిరిజన, మైనార్టీ అన్ని శాఖలు ని దగ్గరనే ఉన్నాయి..ఈ అర్బన్ రెసిడెన్షియల్ ని దగ్గర ఉన్న విద్యా శాఖ కు వస్తుంది.. సర్వ శిక్ష అభియాన్ కింద వస్తుంది.- ఢిల్లీ నుండి నిధులు వచ్చిన గల్లీలో మాత్రం ఇవ్వడం లేదు.

- ఏ విషయం లో కుడా మాట నిలుపు కోలేదు...చెప్పిన మాటకు క్షేత్ర స్థాయి లో పొంతన లేదు.- అసెంబ్లీ లో చెప్పిన మాట కు తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలి..- 1వ తారీకు జీతాలు అని గొప్పలు చెప్పిన సీఎం 10 తారీకు వరకు జీతాలు వెయడం లేదు.- సస్పెండ్ చేయాల్సి వస్తే సీఎం నే సస్పెండ్ చేయాలి. స్కూల్ లో ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన పవన సుత యూత్ వారిని అభినందిస్తున్న- ఇదే స్ఫూర్తి తో రాష్ట్ర వ్యాప్తంగా యువకులు ముందుకు రావాలి...

## భవనమిచ్చారు.. నిధులు మరిచారు

సిరిసిల్ల : ఆధునిక సాగు పద్ధతులపై కర్షకులను సుశిక్షితులను చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. ప్రత్యేక కార్యాచరణతో అన్నదాతలు ఒకే చోట పంట యాజమాన్యంపై చర్చించే వెసులుబాటు కల్పించింది. ఇదంతా బాగానే ఉన్నా నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రతి అయిదు వేల ఎకరాలకు క్లస్టర్‌గా పరిగణిస్తూ రైతు వేదికలను నిర్మించారు. పంటల పరిశీలనకు ఓ వ్యవసాయ విస్తరణ అధికారులను నియమించారు. 2.4 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 57 క్లస్టర్‌ల వారీగా రైతులకు వివిధ రకాల సేవలు అందుతున్నాయి. ఎప్పటికప్పుడు పంట యాజమాన్య పద్ధతులను వివరిస్తూ అన్నదాతలను చైతన్యం చేయాలన్నది వేదికల ప్రధాన ఉద్దేశం. జిల్లాలోని 13 వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం అమలవుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తల సలహాలు దృశ్య మాధ్యమాల ద్వారా అందుతున్నాయి.



**ఏఈవోలపై నిర్వహణ భారం**

మూడేళ్ల క్రితమే రైతు వేదికలు అందుబాటులోకి వచ్చాయి. నిర్వహణ కోసం ప్రతినెల రూ.9 వేలు అందించేందుకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిర్ణయించినా నిధులు అందడం లేదు. నిర్వహణ నిధులు విడుదల కాక సుమారు రూ.10 లక్షల వరకు కరెంటు బిల్లుల బకాయి ఏర్పడింది. వేదికల్లో సమావేశాల నిర్వహణ సమయంలో కుర్చీలు వేయడం మొదలుకొని, చర్యలు ముగిశాక సర్దటం ఏఈవోల వంతుగా మారింది. పరిశుభ్రత చూసేందుకు సహాయకులు లేకపోవడంతో భవనాలు బూజు పడుతున్నాయి. పారిశుద్ధ్య పనుల్లో కనీసం గ్రామ పంచాయతీల నుంచి సాయం అందడం లేదు. జిరాక్సులు, స్టేషనరీల ఖర్చు ఏఈవోలే భరిస్తున్నారు.

**విద్యుత్తు సరఫరా నిలిపివేత**

వీర్నపల్లి మండలంలో రెండు రైతు వేదికలు ఉన్నాయి. ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులు పనిచేయాల్సి ఉండగా ఒకరు ఇటీవల బదిలీపై వెళ్లారు. దీంతో రెండు క్లస్టర్‌లను ఒక్కరే చూస్తున్నారు. ప్రతినెల సుమారు రూ.7 వేల వరకు నిర్వహణ కోసం సదరు ఏఈవోనే భారం మోస్తున్నారు. రూ.14 వేల బకాయి ఉందని ఏడాది క్రితమే గర్జనపల్లి రైతు వేదికకు సెస్ సిబ్బంది కరెంటు సరఫరా నిలిపివేశారు. ఇలాంటి వాస్తవిక పరిస్థితులే జిల్లాలోని చాలా రైతు వేదికల్లో ఉన్నాయని చెబుతున్నారు.

**జీతంలో కొంత నిర్వహణకు..**

ఏఈవోలపై పని ఒత్తిడి ఎక్కువైంది. ప్రతినెల వేదికల నిర్వహణ భారంగా మారుతోంది. తాళాలు తీసింది మొదలు వేసే వరకు అన్ని పనులు విస్తరణ అధికారులే చూడాల్సి వస్తున్నా.. రెండేళ్లుగా ఒక్క రూపాయి నిర్వహణ కోసం రాలేదు. దీంతో జీతం డబ్బులు వెచ్చిస్తున్నాం. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్వహణ నిధులు విడుదల చేయాలి. లక్ష్మణ్, ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు

## శిక్షణతో నైపుణ్యం.. ఉపాధికి మార్గం

గోదావరిఖని: నిరుద్యోగులకు ఉపాధి మార్గం చూపేందుకు సింగరేణి కృషి చేస్తోంది. డంప్‌ట్రక్ ఆపరేటర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తోంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి 50 మంది చొప్పున సింగరేణి యువతకు ఉపాధి మార్గం చూపుతోంది. అవకాశం ఉన్న చోట పొరుగు సేవల ద్వారా ఉపాధి అవకాశాన్ని కల్పిస్తోంది. సంస్థ విస్తరించి ఉన్న పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు వేలాది రూపాయలు వెచ్చించి శిక్షణ అందజేస్తోంది. 32 రోజుల పాటు వివిధ దశల్లో శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేస్తోంది. వీటితో ఎక్కడైనా ఆపరేటర్లుగా ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఏడు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తికాగా ప్రస్తుతం మరో బృందంలో యువత శిక్షణ పొందుతున్నారు.

**వివిధ దశల్లో...**

నిరుద్యోగ యువతను ఉపాధి మార్గం వైపు మళ్లించేందుకు సింగరేణి సంస్థ శిక్షణ కోసం ఎంపిక చేసిన ఒక్కొక్కరిపై రూ.20 వేలు ఖర్చుచేస్తోంది. బెంగళూరుకు చెందిన వోల్వో కంపెనీ నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ప్రతి బ్యాచ్‌లో 50 మందికి శిక్షణ ఇస్తోంది. 18 రోజుల పాటు గోదావరిఖనిలోని ఆర్జీ-1 ఎంవీటీసీలో తరగతులు నిర్వహించిన తర్వాత 12 రోజుల పాటు క్షేత్రస్థాయి శిక్షణ ఉంటుంది. రెండు రోజులు డంప్‌ట్రక్‌తో వెళ్లి పనిచేయాల్సి ఉంటుంది. అక్కడ ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర అంశాలను గమనించి వాటిని అధికారులకు వెల్లడించాల్సి ఉంటుంది.

ప్రభావిత గ్రామాలకు ప్రాధాన్యం

శిక్షణకోసం సింగరేణి ప్రభావిత గ్రామాల యువతకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేపడుతున్న గనుల పరిసర ప్రాంతాల్లోని జనగామ, సుందిళ్ల, ముస్త్యాల, సింగిరెడ్డిపల్లె, పెద్దంపేట, లద్నాపూర్, పన్నూరు ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగ యువతతో పాటు కార్మికులు, విశ్రాంత కార్మికుల పిల్లలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంది. ఇప్పటి వరకు ఏడు బృందాల్లో 335 మంది తర్ఫీదు పొందారు.

**ఎంతో ఉపయోగం**శిక్షణ ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుంది. డంప్‌ట్రక్ డ్రైవింగ్‌లో తర్ఫీదు తీసుకుంటే ఎక్కడైనా ఉద్యోగం సాధించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పరిశ్రమల్లో భారీ యంత్రాల ద్వారానే పనులు చేపడుతున్నారు. డంప్‌ట్రక్ నేర్చుకోవడం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది. సింగరేణి సహకారంతో శిక్షణ తీసుకుంటున్నా.ఎం.డి.సలాఉద్దీన్, గోదావరిఖని

**ఉపాధి కోసం...**

డంప్‌ట్రక్ డ్రైవింగ్ శిక్షణ తీసుకోవడం ద్వారా ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. భారీ యంత్రాల ద్వారా చేపట్టే పనులకు అవకాశం వస్తుంది. మా నాన్న సింగరేణిలో పనిచేశారు. నేను పదో తరగతి వరకు చదువుకున్నా. ఉపాధి అవకాశాలు లభించడం లేదు. శిక్షణ ద్వారా అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నా. శ్రీనివాస్, గోదావరిఖని ఓబీ కంపెనీలో పనికోసంఉపరితల గనుల్లో చేపడుతున్న ఓబీ కంపెనీల్లో పని కోసం చేరేందుకు అవకాశం ఉంటుంది. అందులో నడిచే యంత్రాలపై పనిచేసేందుకు డంప్‌ట్రక్ శిక్షణ ఎంతో అవసరం ఉంటుంది. సింగరేణి యాజమాన్యం ద్వారా మాకు అవకాశం లభించింది. ప్రభావిత గ్రామాల నిరుద్యోగులకు వివిధ రకాల ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. జయపాల్‌రెడ్డి, సుందిళ్ల

# డొక్కు వాహనాలు తుక్కు.. కొత్త వాటికి రాయితీ

కరీంనగర్ : వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. హైదరాబాద్ లోపల 2027 వరకు డీజిల్ ఆటోలు, బస్సులను తిరగకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. మరో వైపు 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలని ప్రభుత్వం స్క్రాపింగ్ పాలసీని అమల్లోకి తెచ్చింది. వాహనాలను తుక్కుగా మార్చి.. కొత్త వాటిని కొనే సమయంలో జీవితకాలపు పన్నుపై రాయితీని ప్రకటిస్తూ జీవో 28ని జారీ చేసింది. ఆ జీవోతో ఎవరికి ఎంత ప్రయోజనమో కథనం.

**నూతన విధానం ఇలా..**

నూతన పాలసీ ప్రకారం 15 ఏళ్లు దాటిన తమ వాహనాలను తుక్కుగా మార్చి.. అదే రకమైన కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే వాహనం ధరను బట్టి జీవితకాలపు పన్నులో రాయితీ ఇస్తుంది. అయితే ముందుగా రవాణా శాఖకు సమాచారమిచ్చి అధీకృత రిజిస్టర్ వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ కేంద్రానికి వెళ్లి వాహనాన్ని తుక్కుగా మార్చుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఆ కేంద్రం జారీ చేసే ధ్రువపత్రాన్ని తీసుకెళ్లి.. షోరూం నిర్వాహకులకు చూపిస్తే పన్ను రాయితీ ఇస్తారు. ఇది రవాణేతర వాహనాలకు వర్తిస్తుంది. ఈ విధానం నోటిఫికేషన్ జారీ అయిన రెండేళ్ల వరకు (సెప్టెంబరు 2026) అమల్లో ఉంటుందని



ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

**స్క్రాపింగ్ కేంద్రాల ఏర్పాటుకు అడుగులు..** రాష్ట్ర ప్రభుత్వం వాహనాలను తక్కుగా మార్చే రిజిస్టర్ వెహికిల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్‌వీఎస్‌ఎఫ్) కేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. మొదట హైదరాబాద్, రంగారెడ్డిలో అందుబాటులోకి తెస్తున్నట్లు సమాచారం. అవసరాన్నిబట్టి విడతల వారీగా వీటిని కామారెడ్డి, కరీంనగర్, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారని సమాచారం. అన్ని జిల్లాలో ఈ కేంద్రాలు అందుబాటులోకి వస్తే వాహనదారులకు సేవలు అందుబాటులో ఉంటాయి.

**విధి విధానాలపై స్పష్టత..**

వాహనాలను తుక్కుగా మార్చితే కొత్తగా కొనుగోలు చేసిన వాహనంపై ఇచ్చే జీవితకాలపు రాయితీకి సంబంధించిన విధి విధానాలు వచ్చాయి. తుక్కు మార్చే కేంద్రాల ఏర్పాటుపై సమాచారం లేదు. పైలెట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్, రంగారెడ్డిలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దశల వారీగా ఇతర జిల్లాలకూ విస్తరిస్తారని తెలిసింది. పెద్దింటి పురుషోత్తం, డీటీసీ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

# హరితం.. అభయం

సిరిసిల్ల : అటవీ మైదాన ప్రాంతాల్లో ఏటా మొక్కలు నాటడం, వాటి సంరక్షణ సత్ఫలితాలను ఇస్తోంది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్–2023'ని రెండు రోజుల కిందట విడుదల చేసింది. ఈ నివేదికలో ఉమ్మడి జిల్లాలో ఏకంగా 71.79 చదరపు కిలోమీటర్లలో అదనపు పచ్చదనం విస్తరించింది. దీనిలో జగిత్యాల జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. అటవీ అగ్నిప్రమాదాలు జగిత్యాల జిల్లాలో 455, పెద్దపల్లిలో 177, రాజన్న సిరిసిల్లలో 170, కరీంనగర్‌లో ఒకటి జరిగాయి. పర్యావరణ సమతుల్యత ప్రకారం 33 శాతం అటవీ విస్తీర్ణం ఉండాలి. కాగా ఉమ్మడి జిల్లాలో 23.14 శాతం ఉంది. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం పెరుగుతున్నా మైదాన ప్రాంతాల్లో పోడు పేరుతో ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు. వీటిని అరికట్ట గలిగితేనే పెరిగిన పచ్చదనం లక్ష్యం నెరవేరుతుంది.

**ఆక్రమణలు ఇలా...**

ఉమ్మడి జిల్లాలో అటవీ భూముల ఆక్రమణ నానాటికీ పెరిగిపోతోంది.



అటవీ ప్రాంతంలోని భూములు ఉన్న రైతులు హద్దుల్లో ఉన్న అటవీ భూమిని తమ పొలాల్లో కలుపుకుంటూ పోతున్నారు. ఫలితంగా రెవెన్యూ పట్టాల్లో ఉన్న విస్తీర్ణానికి మించి అక్కడ భూమి ఉంటోంది. ప్రభుత్వం పోడు పట్టాలు పంపిణీ చేసినప్పటి నుంచి ఆక్రమణలు మరింత పెరిగాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చందుర్తి–మల్యాల అటవీ సెక్షన్లలో చందుర్తి మండలం సనుగుల, దేవునితండా, జగదాంబతండా, రుద్రంగి మండలంలో గువ్వలతండా, కుక్కలగండి, వీరునితండా, దసరానాయక్‌తండా, కోనరావుపేట మండలం శివంగళపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, వీర్నపల్లి మండలం కంచర్లలో వేలాది ఎకరాల్లో చెట్లను నరికి మైదానాలుగా మార్చేశారు.

జగిత్యాల జిల్లా సారంగపూర్, బీర్‌పూర్ అటవీ ప్రాంతంలో 2006లో అప్పటి ప్రభుత్వం 680 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేసింది. ప్రస్తుతం ఈ భూముల చుట్టూ ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. గతేడాది అటవీ అధికారులు 4 వేల ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వాస్తవానికి ఇక్కడ 9 వేల ఎకరాలకు పైనే ఉంటుందని అంచనా. పెద్దపల్లి జిల్లాలో కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాల్లోని అటవీ ప్రాంతంలోనూ సమీప రైతులు ఏటా కొంత కలుపుతూ వెళ్తున్నారు. అటవీ ఆక్రమణల నుంచి రక్షణకు మొక్కలు నాటడం, కందకాలు తీయడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నా అవి పూర్తిస్థాయి ఫలితాలను ఇవ్వడం లేదు. వర్షాకాలం సీజన్‌లో అటవీ మైదాన ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు వెళ్తున్న అటవీ అధికారులపై గిరిజనులు తిరగబడటం, నాటిన మొక్కలను ధ్వంసం చేసి సాగు చేయడం వంటి ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఆక్రమణలపై అటవీశాఖ కఠినంగా వ్యవహరించినప్పుడే పెరిగిన పచ్చదనం కాపాడటం సాధ్యమవుతుంది.

# పంచాయతీలకు ట్రాక్టర్లు భారం



కొణిజర్ల : పంచాయతీల్లో పరిశుభ్రతే లక్ష్యంగా చెత్తసేకరణ కోసం గత ప్రభుత్వంలో ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా ట్రాక్టరుతోపాటు ట్రక్కు, ట్యాంకర్‌లను తీసుకున్నారు. వాటితో చెత్త సేకరణతోపాటు, మొక్కలకు నీటిని సరఫరా చేశారు. పాలకవర్గాలు ఉన్న సమయంలో ట్రాక్టర్ కిస్తీలతోపాటు నిర్వహణ సక్రమంగా ఉండేది. ప్రత్యేక పాలన వచ్చిన తర్వాత పంచాయతీలకు నిధులు రాకపోవడంతో వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ట్రాక్టర్ల మరమ్మతులు చేయించలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో కొన్ని నెలలుగా చెత్తసేకరణ నత్తనడకన సాగుతుండగా, చిన్న పంచాయతీల్లో పూర్తిగా నిలిచిపోయింది. కిస్తీలు చెల్లించలేక, మరమ్మతులు చేయించలేని పరిస్థితి ఉండటంతో పల్లెల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.

**మరమ్మతులు చేయించలేక...**

ఖమ్మం జిల్లాలో 584 పంచాయతీలుండగా అన్నిచోట్ల చెత్తసేకరణ కోసం ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటికి సంబంధించిన కిస్తీలు ప్రతినెలా రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు చెల్లించాల్సి ఉండగా పంచాయతీల్లో నిధుల్లేక ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీల్లో ఉన్న కొద్ది నిధులు పారిశుద్ధ్య పనులకే సరిపోతుండటంతో మిగతా పనులకు ఆటంకంగా మారింది. ట్రాక్టర్లను తీసుకుని అయిదేళ్లు కావడంతో తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వాటిని బాగు చేయించాలంటే రూ.30 వేల వరకు ఖర్చవుతుండటంతో పంచాయతీలకు భారంగా మారింది. కనీసం డీజిల్‌కు నగదులేక పల్లెల్లో వారానికి ఒకసారి మాత్రమే చెత్తసేకరణ చేస్తున్నారు. కార్యదర్శులు డీజిల్‌కు సొంత నగదు ఖర్చు చేస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో డీజిల్, కిస్తీలకు సంబంధించిన నగదును సర్దుబాటు చేస్తున్నా.. చిన్న పంచాయతీల్లో మాత్రం ట్రాక్టర్లను తిప్పలేని పరిస్థితి ఉంది.

**ఆటంకాలను అధిగమించి.. చెత్త సేకరణ**

పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణకు సంబంధించి నిధుల కొరత ఉంది. ప్రభుత్వం నుంచి ఏ నిధులు వచ్చినా మొదటి ప్రాధాన్యం ట్రాక్టర్లకు ఇస్తున్నాం. ఏదో రకంగా చెత్తను సేకరిస్తూ గ్రామాలను స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

చంద్రశేఖర్, డీఎల్‌పీఓ, కల్లూరు

**ఎక్కడ చూసినా ఇబ్బందులే..**

కొణిజర్ల మండలం ఉప్పలచెలక పంచాయతీలో రెండు నెలల క్రితం ట్రాక్టర్‌ను మరమ్మతుల నిమిత్తం తీసుకువెళ్లారు. రూ.30 వేల వరకు ఖర్చు వస్తుండటంతో పంచాయతీలో నిధుల్లేక అధికారుల పట్టించుకోవడం లేదు.

కల్లూరు మండలం మర్లపాడు, పోచారంలో ట్రాక్టర్ల మరమ్మతులకు గురవడంతో చెత్తసేకరణ నిలిచిపోయింది.

వేంసూరు మండలంలో 20 పంచాయతీల్లో కొన్ని నెలలుగా ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తల్లాడ మండలం మంగాపురం, రామానుజవరం, బాలపేట, తెలగారంలో ట్రాక్టర్ల కిస్తీలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.

కల్లూరు మండలం పుల్లయ్యబంజర, కప్పలబంధం, బత్తుపల్లి, మరో నాలుగైదు పంచాయతీల్లో నిధుల్లేక కిస్తీలు చెల్లించలేని దుస్థితి.

వైరా, మధిర, పాలేరు నియోజకవర్గంలోని చిన్న పంచాయతీల్లో నిధుల్లేక ట్రాక్టర్లను చెత్తసేకరణ జరగడం లేదు. కార్యదర్శులు డీజిల్ ఖర్చును భరించి కొంత వరకు చెత్త సేకరణ చేస్తున్నా.. చిన్న పంచాయతీల్లో మాత్రం చేతులెత్తేశారు.

# ప్రసవాలా.. అయితే.. సర్వజనాసుపత్రికే!




ఖమ్మం : మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది. సర్కారు దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తోంది. పట్టణాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. ఈ భారమంతా పెద్దాసుపత్రిపై పడుతోంది. వాస్తవానికి సాధ్యమైనంతవరకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో కాన్పులు నిర్వహించాలి. కానీ, హైరిస్క్ కాకపోయినా చాలా కేసులను పెద్దసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తున్నట్లు సమాచారం.

**కనీసం పదికిపైగా..**

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రతి పీహెచ్‌సీలో నెలకు కనీసం పది వరకు కాన్పులు నిర్వహించాలి. జిల్లాలోని 26 పీహెచ్‌సీల్లో 24 గంటల సేవలందించే ఆసుపత్రులు ఎనిమిది ఉన్నాయి. వీటిల్లో ఒక్కో ఆసుపత్రిలో నెలకు పది చొప్పున ప్రసవాలు జరిగినా.. ఏడాదికి 120 వరకు చేయవచ్చు. కానీ అన్ని ఆస్పత్రుల్లో కలిపి ఏడాది మొత్తం 22 నుంచి 40కి మించి ఎక్కడా కాన్పులు చేయలేదు. మిగిలిన చోట్లచూస్తే.. బోనకల్లు, గంగారం కేంద్రాల్లో మాత్రమే 50 వరకు ప్రసవాలు జరిగాయి. మిగతా వాటిల్లో 30కి లోపే కాన్పులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో కూసుమంచి, మంచుకొండ, మాటూరుపేట, నేలకొండపల్లి, సుబ్లేడు, ముదిగొండ వల్లభి కేంద్రాల్లో జరిగిన కాన్పులు పది లోపే.

**సీహెచ్‌సీల్లోనూ అంతంతే..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో ప్రసవాల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నా కాన్పులు పెరగడం లేదు. కల్లూరులో ఏడాదిలో ఒక్క కాన్పు మాత్రమే చేశారు. తిరుమలాయపాలెంలో 5, మధిరలో 26, నేలకొండపల్లిలో 18, పెనుబల్లిలో 146, సత్తుపల్లిలో 328 కాన్పులు జరిగాయి. వైద్య సిబ్బందితో పాటు.. బర్త్‌ప్లాన్ తయారు చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది సైతం తమ పనిని సులువు చేసుకునేందుకు అత్యధిక హైరిస్క్ కేసులుగా చూపుతున్నారని సమాచారం. ఫలితంగా పెద్దాసుపత్రి ఎంసీహెచ్‌లోని వార్డుల్లో మంచాలు సరిపోక వరండాలో పడకలు ఏర్పాటు చేసి బాలింతలకు చికిత్స అందిస్తున్నారు.

పీహెచ్‌సీల్లో రిస్క్ లేని మొదటి కాన్పు కేసులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి కేసును సర్వజనాసుపత్రికి పంపాల్సిన అవసరం లేదు. అన్ని కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య ఇంకా పెంచాలి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సాధారణ కాన్పులను పెంచేందుకు గర్భిణులకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ఆయుష్ విభాగం తరపున 19 మంది శిక్షకులను నియమించడం జరిగింది.

– డాక్టర్ సైదులు, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి

# చాపకింద నీరులా గంజాయి వ్యాపారం

ఖమ్మం : సిబ్బంది కొరత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో సమర్థవంతంగా గంజాయి రవాణాదారుల ఆట కట్టించలేకపోతున్నారు. ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలకు తెచ్చిన ఓ జాగిలం పక్కనున్న భవనంపై పూల కుండీల్లో పెంచుతున్న గంజాయిని కనిపెట్టింది. ఇటువంటి జాగిలాల వ్యవస్థ ఆబ్కారీశాఖ వద్ద లేదు. వాహనాలు విప్పి లోపలి భాగాల్లో, రైళ్లలో కొత్తకొత్త పద్ధతుల్లో గంజాయి తరలిస్తుండగా.. నిలువరించడం ఆబ్కారీ అధికారులకు తలకుమించిన భారంగా పరిణమిస్తోంది.

**ట్రాకింగ్ వ్యవస్థ ఏదీ!**

గంజాయి తరలుతోందని సమాచారమందితే వాహనాన్ని ట్రాక్ చేసే వ్యవస్థ ఆబ్కారీశాఖ వద్ద లేదు. పోలీసుశాఖ సహకారం కోరడం.. వారు సహకరిస్తే సరి లేకుంటే ముఠా వీరి కనుసన్నల్లోంచి సులువుగా జారుకుంటోంది. ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దుల వద్ద ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పలు ముఠాలను పట్టుకొంది. నిందితులు ఎక్కువగా పాతబడిన వాహనాలు ఉపయోగిస్తారనే ఉద్దేశంతో వాటిని తనిఖీ చేసి పట్టుకున్న కేసులే ఎక్కువ. గంజాయి ద్రవరూపంలోకి మార్చి, వివిధ మార్గాల్లో, నూనె డబ్బాల లోడులా సరఫరా చేస్తున్నారు. కొత్త వాహనాల్లోనూ సరకు తరలిస్తున్నట్లు ఇటీవల సంఘటనలు నిరూపిస్తున్నాయి.

**సిబ్బంది, వాహనాల కొరత**

తనిఖీల్లో ఎస్సైలు, సిబ్బందిదే ప్రధాన భూమిక. ఎస్సైల కొరత తీవ్రంగా ఉంది. 9 మంది ఎస్సైలు మాత్రమే ఉన్నారు. గంజాయి ఎక్కువగా పట్టుబడే ఖమ్మం–2 స్టేషన్‌లో ఒక్కరూ లేరు. శాఖలో అన్ని అద్దె వాహనాలే ఉన్నాయి. ఏడాదిన్నరగా వాటికి చెల్లింపులు లేవు. తనిఖీలు అంతంతగానే కొనసాగుతున్నాయి. శాఖ పరిస్థితిని జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి ముందు ఉంచగా జాగిలాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని, ఇది చాలా వ్యయప్రయాసలతో కూడిన అంశమన్నారు. సిబ్బంది కొరత ఉందని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తామని చెప్పారు.



**పిల్లలే కొరియర్లు**

గంజాయి అక్రమార్కులు తాజాగా సరఫరా కోసం మైనర్లను రంగంలోకి దింపారని పలు కేసులు రుజువు చేశాయి. గంజాయి రవాణాకు అనువైందనే పేరు పడ్డ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎప్పుడు సోదాలు చేసినా కిలో నుంచి అయిదు కిలోలకు తగ్గకుండా సరకు పట్టుబడుతోంది. ఇప్పుడీ రైళ్లల్లో మైనర్లతో సరకును రవాణా చేస్తుండగా వారిని పట్టుకుంటే అనుసరించాల్సిన పద్ధతులు, తక్షణం వారిని సంరక్షించడం సమస్యగా మారుతోందని, మైనర్లను వదిలేసి దొరికినంత సరకును పట్టుకొచ్చి నిందితుల ఆచూకీ కోసం వెతుకుతున్నామని చెప్పడం అలవాటుగా మార్చుకున్నారు.

ఆబ్కారీ స్టేషన్లు: 7

నవంబరు వరకు పట్టుకున్న కేసులు: 84

పట్టుబడ్డ నిందితులు: 90

సీజ్ చేసిన సరకు: 792 కిలోలు

స్వాధీనం చేసుకున్న వాహనాలు: 14

# బస్సుల కొరత గమ్యం చేరేదెలా?

మంథని: మంథని ఆర్టీసీ బస్సు డిపో లాభాల బాటలో నడుస్తున్న ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 1996లో 40 బస్సులతో ప్రారంభమైన ఈ డిపోలో బస్సుల సంఖ్య ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా పెరగకపోవడం సమస్యగా మారింది. డిపో నుంచి 31 ఆర్టీసీ, 21 అద్దె బస్సులు కలిపి మొత్తం 52 బస్సులు నడుపుతున్నారు. మంథని ఆర్టీసీ డిపో గత నవంబరు 30 వరకు రూ.5.12 కోట్ల లాభాల్లో ఉంది. ఇటీవల నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు రూట్లలో నైట్ హాల్ట్ బస్సులు పునరుద్ధరించాలని కోరారు. బస్సుల సంఖ్య పెంచాలన్న డిమాండ్ కూడా పెరిగింది.

**విన్నపాలు ఇవీ..** గతంలో ఉప్పట్ల, నాగెపల్లి, చంద్రాపూర్(మహారాష్ట్ర), వేములవాడలకు బస్సులు నడిపేవారు.. ఆరెంద, తాడిచెర్ల గ్రామాలకు నైట్‌హాల్ట్ బస్సులు నడిచేవి. జమ్మికుంట, కాళేశ్వరం నుంచి వేములవాడకు బస్సులు నడపాలని.. ఆరెంద, తాడిచెర్లకు నైట్‌హాల్ట్ బస్సులు నడుపాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు. గోదావరిఖని నుంచి మంథనికి రాత్రి 8 గంటల తర్వాత, కరీంనగర్ నుంచి మంథనికి 8.30–10 గంటల మధ్య బస్సు సౌకర్యం లేదు. మంథని నుంచి చంద్రాపూర్‌కు బస్సు సర్వీసు నిలిపివేయడంతో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో బొగు గనుల్లో పని చేస్తున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడంతో మంథని డిపో బస్సుల్లో ప్రయాణికులు సంఖ్య 60శాతం నుంచి 90 శాతానికి పెరిగింది.

మంథని డిపోకు కరీంనగర్, పెద్దపల్లి, హైదరాబాద్, గోదావరిఖని, భూపాల్‌పల్లి రూట్లలో అధిక ఆదాయం వస్తుంది. పల్లెవెలుగు బస్సులు నడిచే ఆరెంద, తాడిచెర్ల, పెద్దతూండ్ల, ఓడెడ్ రూట్లలో కనీసం డీజిల్ ఖర్చు కూడా రావడం లేదని డీఎం చెబుతున్నారు.

**అదనపు బస్సులు వస్తే నడుపుతాం** ప్రయాణికుల రద్దీ అనుగుణంగా ఆ రూట్‌లో బస్సులు నడుపుతున్నాం. చంద్రాపూర్‌కు త్వరలోనే బస్సు నడుపుతాం. జమ్మికుంటకు నడపడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. గోదావరిఖని నుంచి మంథనికి రాత్రిపూట బస్సు నడపడానికి సమయాల్లో మార్పు చేస్తాం. రాత్రి కరీంనగర్ నుంచి మంథనికి బస్సులు ఆలస్యంగా రాకుండా చర్యలు తీసుకుంటాం. డిపోకు అదనపు బస్సుల వచ్చిన తర్వాత ప్రయాణికులు కోరిన రూట్లలో బస్సులు నడుపుతాం. శ్రావణ్‌కుమార్, మంథని ఆర్టీసీ డీఎం

# నిధులున్నా పనుల్లో జాప్యం

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో రవాణా కష్టాలు తీరడం లేదు. అటవీ ప్రాంతాల గుండా రహదారుల నిర్మాణాలకు ఆ శాఖ అభ్యంతరాలు చెబుతోంది. దీంతో నిధులున్నా నిర్మాణాలు చేపట్టలేని దుస్థితి నెలకొంది. గ్రామీణుల ప్రయాణం దూరాభారం అవుతోంది. దీనికితోడు అసంపూర్తి రహదారుల్లో అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.

వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం మండలాల ప్రజలు రాజన్న ఆలయానికి చేరుకోవాలంటే కోరుట్ల, జగిత్యాల మీదుగా 35 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన పరిస్థితి ఉంది. చందుర్తి – మేడిపల్లి మండలం మోత్కురావుపేట రహదారికి 3.5 కిలోమీటర్లు అటవీ ప్రాంతం ఉంది. దీనిలో రహదారి నిర్మాణానికి ఇటీవల మొదటి దశ అనుమతులు లభించాయి. అటవీ ప్రాంతంలో రహదారి నిర్మాణం పూర్తయితే వేములవాడకు 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

సిరిసిల్ల నియోజకవర్గంలో తంగళ్లపల్లి–ముస్తాబాద్ మండలాలను కలిపేందుకు జిల్లెల్ల మీదుగా రెండు వరుసల రహదారి నిర్మాణానికి 2018లో రూ.5 కోట్లు మంజూరయ్యాయి. వీటితో జిల్లెల్ల శివారు భగత్‌నగర్, ముస్తాబాద్ వైపు తెర్లుమద్ది వరకు రహదారి పనులు పూర్తయ్యాయి. భగత్‌నగర్ నుంచి తెర్లుమద్ది శివారు వరకు మూడు కిలోమీటర్ల రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీంతో ఈ రెండు మండలాల వారు ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, తంగళ్లపల్లి మండలం మండెపల్లి మీదుగా తిరిగి వెళ్తున్నారు.

సిరిసిల్ల– నిజామాబాద్ జిల్లాలను కలిపే మరిమడ్ల–మానాల రహదారికి నాలుగేళ్ల క్రితం రూ.8.5 కోట్లు మంజూరయ్యాయి. 8 కిలోమీటర్ల రహదారి పూర్తిగా అటవీ ప్రాంతం నుంచి వెళ్తుంది. దీనిలో నాలుగు కిలోమీటర్ల మేరకు మొదటి దశ అటవీ అనుమతులు వచ్చాయి.



కొంతమేరకు మట్టి పనులు కూడా జరిగాయి. మరో నాలుగు కిలోమీటర్ల పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సిరిసిల్ల నుంచి జిల్లావాసులు 35 కిలోమీటర్లలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు.

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని శివారు మండలాలు వీర్నపల్లి, కోనరావుపేటకు ఎగ్లాస్‌పూర్ మీదుగా రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఈ మార్గంలో కంచర్ల వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తయింది. దాని తర్వాత 1.5 కిలోమీటర్ల మేరకు రహదారి నిర్మాణం ఏడేళ్లుగా ముందుకు సాగడం లేదు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య 12 కిలోమీటర్లలో రాకపోకలు సులభమవుతాయి. అలాగే వీర్నపల్లి మండలం మద్దిమల్ల నుంచి కామారెడ్డి వెళ్లేందుకు మాచారెడ్డి మండలం సోమరిపేట గ్రామ పరిధిలోని బంజేరుపల్లితండాలో రెండు కిలోమీటర్ల మేరకు అటవీ అనుమతులు రాక రహదారి అసంపూర్తిగా ఉంది. ఈ రహదారి పూర్తయితే వీర్నపల్లి నుంచి 30 కిలోమీటర్లలో కామారెడ్డి చేరుకోవచ్చు. ఎల్లారెడ్డిపేట మీదుగా 55 కిలోమీటర్లు తిరిగి వెళ్లాలి.

కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాలను కలిపే రహదారిలో అక్కపల్లి శివారు అటవీ ప్రాంతంలో దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉంది. ఈ రెండు మండలాల శివారు గ్రామాల వారు మండల కేంద్రాలకు వెళ్లాలంటే వ్యయ,ప్రయాసలు తప్పడం లేదు. అసంపూర్తి రహదారులతో ఈ గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేదు.

**పనుల పూర్తికి చర్యలు**

రవాణా సౌకర్యం మెరుగుపడితేనే ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. చందుర్తి– మోత్కురావుపేట రహదారికి మొదటి దశ అటవీ అనుమతులు వచ్చాయి. వారికి డబ్బులు చెల్లించి పనులు ప్రారంభిస్తాం. జిల్లెల్ల, ముస్తాబాద్ రహదారికి అనుమతులు రావాల్సి ఉంది. మరిమడ్ల, మానాల రహదారితోపాటు మిగతా అటవీ అనుమతుల్లేక నిలిచిన పనులను పరిశీలించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. వెంకటరమణయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ

# ముందస్తు పరీక్ష...నవ జాత శిశువుకు రక్ష

కొత్తగూడెం : మేనరికం, వయసు మీదపడిన తర్వాత వివాహాలు చేసుకోవడం వల్ల నవజాత శిశువుల్లో జన్యులోప సమస్యలు తలెత్తుతున్నాయని పరిశోధనల్లో తేలింది. ప్రతి 500 మంది శిశవుల్లో ఒకరికి పలు వ్యాధులు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో పుట్టిన వెంటనే శిశువులకు జన్యు వాధుల గుర్తింపు(స్క్రీనింగ్) పరీక్షలను నిర్వహించేందుకు కొత్తగూడెం రామవరంలోని మాతా, శిశ ఆరోగ్య కేంద్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఉస్మానియా వర్సిటీకి చెందిన హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డీసీజెస్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ విభాగం వారు స్క్రీనింగ్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఇటీవల కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రారంభించారు.

**థలసీమియా, సికిల్‌సెల్ ఎనిమీయా గుర్తింపు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జన్యుపరమైన థలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వంటి జన్యు వ్యాధులతో ఎక్కువ మంది చిన్నారులు బాధపడుతున్న విషయం తెలిసిందే. చాలామందిలో పెద్దయ్యాకే వ్యాధి లక్షణాలు బయటపడుతున్నాయి. కొందరికి జబ్బు ముదిరి ప్రాణాపాయం తలెత్తుతోంది. ఈ క్రమంలో శిశువులకు థలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధుల లక్షణాలున్నాయో? లేవో? తేల్చేందుకు సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), మైక్రోస్కోపిక్ అబ్జర్వేషన్, హెచ్‌పీఎల్‌సీ, ఇతర జన్యుక్రమ పరిశీలన పరీక్షలు చేస్తారు. ఎవరిలోనైనా జన్యుపరమైన లోపాలను గుర్తిస్తే రక్తమార్పిడి, ఐరన్ కిలేషన్, బోన్ మ్యారో



ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి చికిత్సలు అందేలా వైద్య నిపుణులు చూస్తారు. ఇతర ఆసుపత్రులకు కేసులను సిఫార్సు చేస్తారు.

అప్పుడే పుట్టిన నవజాత శిశువులకే కాకుండా గర్భిణులకు కూడా రామవరం ఎంసీహెచ్‌లో 'జన్యు' పరీక్షలు చేస్తారు. ఎవరికైనా జన్యు సంబంధ సమస్యలున్నాయా? వాటివల్ల గర్భస్థ శిశువుకు ఏమైనా ప్రమాదముందా? అనేది నిర్ధారిస్తారు. ఎలాంటి వ్యాధి లక్షణాల్లేకుండా సాధారణ జీవితం గడుపుతూ ఆ తర్వాత జన్యులోపం బయటపడే వారిని 'క్యారియర్'లుగా గుర్తిస్తారు. వారికీ కొత్తగా అందుబాటులోకి వచ్చిన పరీక్షలు చేస్తారు.

– డా. ఎల్. భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

**పరీక్షలు ఎవరికి నిర్వహిస్తారంటే..?**

శిశువుల సాధారణ ఆరోగ్యాన్ని, అభివృద్ధిని ప్రభావితం చేసే జన్యు సంబంధ సమస్యలను ముందస్తుగా గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. ఇందుకోసం రెండు రోజుల నుంచి 28 రోజుల్లోపు రక్తనమూనాలు సేకరిస్తారు. ముఖ్యంగా, మేనరిక వివాహాలు, కాన్పుల వేళ అనారోగ్య సమస్యలు తలెత్తే కుటుంబాలకు నవజాత శిశువులకు పరీక్షలు చేసి ఫలితాలు విశ్లేషిస్తారు. అంతేకాకుండా, ఆధునిక సాంకేతిక చికిత్సల సాయంతో జన్మించే కొందరు శిశువుల్లో హైపోథైరాయిడిజం, గాలక్టోసేమియా, బయోటినిడేస్ వంటి లోపాలు తలెత్తుతాయి. వీటిని గుర్తించేందుకూ స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఆయా శిశువుల కాలి మడిమ నుంచి నమూనాల్ని సేకరిస్తారు.

# చి'వరి'లో కారుమబ్బులు



కొత్తగూడెం : పంట చేతికందే దశలో వరుస తుపాను గండాలు ధాన్యం రైతుల్లో గుబులు రేపుతున్నాయి. సరిగ్గా ఈ నెల ఆరంభాన ఫెయింజల్ తుపాను కలవరపెట్టింది. అప్పటి వరకు జోరందుకున్న కోతలు కాస్తా ఒక్కసారిగా నిలిచిపోయాయి. కాస్త తేరుకున్నామని ఊపిరి పీల్చుకుంటుండగా, ఇంతలో నైరుతి–పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. తాజా తుపాను ప్రభావంతో వచ్చే శనివారం వరకు వర్ష సూచన ఉందని వాతావరణ విభాగం చెబుతోంది. చి'వరి' దశ కోతలకు, పంట విక్రయాలకు కష్టాలు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

**కల్లాల్లో దైన్యం..**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంగళవారం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కారు మబ్బులు కమ్మడంతో పచ్చి ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఖమ్మం జిల్లాలోని వైరా, మధిర, ఏన్కూరు, తల్లాడ తదితర మార్కెట్ యార్డుల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి, కొత్తగూడెం, చంద్రుగొండ, సుజాతనగర్ మండలాల్లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తూకాలు నిలిచాయి. ఆయాచోట్ల ధాన్యం కుప్పలపై పరదాలు కప్పిఉంచారు. గ్రామాల్లో ఆలస్యంగా కోతలు కోసినచోట్ల ధాన్యం కొనుగోలు ప్రైవేటు వ్యాపారులు, దళారుల జాడే లేకుండా పోయింది. ఇంకోవైపు తేమ, తాలు కారణంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తూకాలకు మరింత సమయం పడుతోంది. కొన్నిచోట్ల దళారులు పంట కొనుగోలు చేస్తున్నా, తక్కువ ధర దండా కొనసాగిస్తున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.

**ఖమ్మంలో అలా..**

భద్రాద్రిలో ఇలా..గత నవంబరు నెల మొదటి వారం నుంచి ఖమ్మంలో, ఈ నెల రెండో వారం నుంచి భద్రాద్రి జిల్లాల్లో కోతలు మొదలయ్యాయి. దీంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. మంగళవారం నాటికి ఖమ్మం జిల్లాలో 32,972 మంది రైతుల నుంచి 2,01,147 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇక్కడ దాదాపు కోతలు పూర్తికావొస్తుండగా.. కల్లాల్లో ధాన్యం రాశులు ఆరబెట్టారు. భద్రాద్రి జిల్లాలో ఇప్పటి వరకు 56,500 మెట్రిక్ టన్నులను సేకరించారు. ఈ సీజన్‌లో 1.20 లక్షల మె.ట. ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. మరో 15 శాతం వరకు కోతలు మిగిలి ఉండగా.. ఇక్కడా పలుచోట్ల కల్లాల్లో ధాన్యం రాశులున్నాయి.

"మధిర మార్కెట్ యార్డుకు 300 బస్తాల ధాన్యం తీసుకొచ్చా. మంగళవారం కురిసిన వర్షానికి మొత్తం తడిసిపోయింది. మళ్లీ ఆరబెట్టడం ఎంతో ఖర్చుతో కూడుకుంది. మరో 50 మంది రైతుల ధాన్యం కూడా తడిసింది."

– ఈదర రాజశేఖర్, మధిర

"నా పేరు బుగ్గారపు నాగేశ్వరరావు. మాది వైరా మండలం సోమవరం గ్రామం. నాకున్న ఆరెకరాల్లో దొడ్డు, సన్న రకాలను సాగు చేశాను. నాట్లు ఆలస్యమయ్యాయి. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేదు. పండిన పంటనైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని వచ్చా. తేమ ఉందనడంతో ధాన్యం ఆరబెట్టా. ఇంతలో తుపాను మొదలైంది. తేమ శాతం రావాలంటే మరో రెండు వారాలకు పైగా సమయం పట్టేలా ఉంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు".

"ఇంకా వరి కోతలు కొనసాగుతున్న మండలాల్లోని రైతులను వర్షాల నేపథ్యంలో అప్రమత్తం చేస్తున్నాం. యాప్ సాయంతో వర్ష సూచనలిస్తున్నాం. వాతావరణం పొడిబారే వరకు కోతలు చేపట్టవద్దని చెబుతున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాం. జిల్లాలో సంక్రాంతి నాటికి కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశముంది".

– త్రినాథ్‌బాబు, డీఎం, భద్రాద్రి

# నిర్మాణానికి రూ.కోట్లు.. నిర్వహణకు పాట్లు!

కరీంనగర్ : తీగల వంతెన కరీంనగర్‌కు తలమానికమని ఆకాశానికెత్తారు. కొన్నాళ్లు కళల వేదికగా వారం వారం మస్తీ నిర్వహించారు. రాష్ట్రంలోనే ప్రత్యేకమనే విధంగా నిర్మాణ సొబగులు అద్దారు. రంగుల వెలుగులతో కొత్త లోకాన్ని చూపెట్టారు. పర్యాటక సిగలో కరీంనగర్‌కు ప్రత్యేక స్థానాన్ని అందిస్తామనే మాట కొన్నాళ్లకే పరిమితమైంది. ఇదంతా ఆరంభ శూరత్వమనే పంథా ఇప్పుడు కళ్ల ముందు కనిపిస్తోంది. కళ తప్పిన తీరుతో ప్రతిష్ఠాత్మకమైన వంతెన ఇప్పుడు నిర్లక్ష్యంలో కొట్టుమిట్టాడుతోంది. రూపాయలు వెచ్చించిన నిర్మాణానికి సంబంధించి నిర్వహణ ఊసే లేక ఏడాదిలోపే కళావిహీనంగా మారిపోయింది.

**రూ.184 కోట్ల వ్యయం..!**

రూ. 224 కోట్ల నిర్మాణ అంచనాతో ప్రారంభించిన ఈ వంతెన కోసం దాదాపు రూ. 184 కోట్ల వరకు ఖర్చు చేశారు. 2017 డిసెంబరులో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. అయిదేళ్లపాటు ఆగుతూ.. సాగుతూ ఇక్కడి పనులు నడిచాయి. విదేశీ పరిజ్ఞానంతోపాటు ఆధునిక సాంకేతికతను ఈ నిర్మాణానికి ఉపయోగించారు. 500 మీటర్ల పొడవైన వంతెనను నాలుగు వరుసల రోడ్డుగా ఏర్పాటు చేశారు. రెండు అతిపెద్ద పైలాన్‌లు, వాటికి ఉన్న 26 పొడవైన స్టీల్ కేబుళ్ల ద్వారా ఈ వంతెన మానేరు నదిపై వేలాడే విధంగా చూడముచ్చటగా నిర్మించారు. 28 టిప్పర్లలో ఇసుక నింపి 950 టన్నుల బరువును దీనిపై నిలిపి సామర్థ్య పరీక్ష నిర్వహించారు. ఎట్టకేలకు 2023 జూన్ 23న అట్టహాసంగా ప్రారంభించారు. రోజులపాటు ప్రతి వారం మస్తీ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తర్వాత ఈ వంతెనపై చేపట్టాల్సిన మిగులు పనులు సహా నిర్వహణను మరిచిపోయారు.

**పొంచి ఉన్న ప్రమాదాలు**

ఇరువైపులా దాదాపు కిలోమీటరు మేర సైడ్‌వాల్‌ను నిర్మించకపోవడంతో కనిపించే ఊచలతో ప్రమాదం పొంచి ఉంది.తారు నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పలుమార్లు లేచిపోయి వాహనదారులకు ప్రమాదాలు జరిగాయి.ఇప్పటికీ ఇక్కడ రాత్రి వేళ దీపాలు వెలగక అంధకారంలోనే ఉంటోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అయింది.విభాగినిపైన చెట్లు ఎండిపోయాయి. అక్కడక్కడ సిమెంట్ లేచిపోయి విభాగినులు అధ్వానంగానే మారిపోయాయి.అటు.. ఇటు 25 ఆధునిక విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయగా అందులో చాలా వరకు విరిగిపోయి నిరుపయోగమయ్యాయి.

**ఎవరికీ పట్టట్లేదు..!**

తమకేమి సంబంధం లేదని నగర పాలక సంస్థ, తమది బాధ్యత కాదని ర.భ.శాఖ ఈ వంతెన నిర్మాణం విషయంలో చేతులెత్తేశాయి. నిర్మాణ బాధ్యతలను మాత్రమే తాము పర్యవేక్షించామని ర.భ.శాఖ అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. విద్యుత్తు సరఫరా, బిల్లు, ఇతర నిర్వహణతో తమకేమి సంబంధమని బల్దియా అధికారులు కూడా మాట దాటేస్తున్నారు. వాస్తవానికి ఈ నిర్మాణం విషయంలో ముందు నుంచి సరైన అంచనాలు, ఒప్పందాలు లేకపోవడం కూడా ఇబ్బందిని పెంచుతున్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా రూ. 8 కోట్ల వ్యయంతో డైనమిక్ లైట్లు, రెండు పైలాన్‌లకు భారీ తెరలు ఏర్పాటు చేశారు. ఇదంతా మున్నాళ్ల ముచ్చటగానే మారిపోయింది. ఆ లైట్లు ఎక్కడా వెలగడంలేదు. తెరలో దృశ్యం కనబడటంలేదు. వాస్తవానికి వీటిని ఏర్పాటు చేసే సమయంలోనే రెండు, మూడేళ్లపాటు ఏ తరహా లోపం తలెత్తినా.. ఆ టెండర్‌ను దక్కించుకున్న సంస్థనే బాధ్యతలు తీసుకోవాలి. కానీ వీటి ఏర్పాటు విషయంలో ఎలాంటి నిబంధనలను అమలు చేయలేదనేది ప్రస్తుత తీరును బట్టి అర్థమవుతోంది. ఆగమేఘాల మీద దీన్ని నిర్మించాలనే తొందరలో ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కోట్లాది రూపాయలను మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేసినా.. ఇప్పుడు ఇక్కడి పరిస్థితి ఏంటనే ప్రశ్న నగర ప్రజల నుంచి వినిపిస్తోంది.

# ఇంకా.. ఎన్నాళ్లకో!

కొత్తగూడెం : బొగ్గు ఉపరితల గనులతో ఒక విధంగా పర్యావరణ విధ్వంసం జరుగుతోంది. ఈ క్రమంలో మూతపడిన గనుల ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడేలా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సింగరేణి వంటి సంస్థలకు సూచనలిస్తోంది. ఇందులో భాగంగానే కొత్తగూడెం ఏరియాలో మూసివేస్తున్న జీకే ఓసీ, ప్రభావిత ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు సంస్థ నడుం బిగించింది. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు. పనులు పూర్తికావస్తుండగా.. స్థానిక ప్రకృతి ప్రేమికులను అనుమతించకపోవడంపై నిరాశ వ్యక్తమవుతోంది. త్వరలో మూతపడనున్న జీకే ఓసీ చెరువు, నర్సరీలను కలుపుతూ 'పర్యావరణ ఎకో పార్కు'ను తీర్చిదిద్దాలనేది సింగరేణి లక్ష్యం. ఇందుకు గాను రూ. 4.78 కోట్లు వెచ్చించారు. జిల్లా పర్యాటకానికి దీన్నొక తలమానికంగా మార్చాలనే ఉద్దేశంతో రెండేన్నరేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన రుద్రంపూర్‌లోని ప్రగతి(బృందావనం)వనాన్ని కలుపుకొని.. సమీప ధన్‌బాద్ చెరువు, సమీప జీకే ఓసీ తటాకం, నర్సరీలను ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేస్తూ వచ్చారు. కేవలం ధన్‌బాద్ చెరువు సుందరీకరణకే రూ. 3.14 కోట్లు కేటాయించగా, జీకే ఓసీ ప్రాంతం అభివృద్ధికి రూ. 1.14 కోట్లు వెచ్చించారు. మిగిలిన రూ. 50 లక్షలతో పచ్చదనం పెంపొందిస్తున్నారు. జీకే ఓసీ చెరువుకు రక్షణగా చేపట్టిన ఫెన్సింగ్‌తో పాటు వ్యూ పాయింట్, కేఫ్‌టేరియా వంటి తుది దశ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

చుట్టూ ఎత్తైన గుట్టల్లో సంచరించే పక్షుల అందాలను తిలకించే 'బర్డ్ వాచింగ్ టవర్' ఇప్పటికే పూర్తయింది. తేనెటీగలను సైతం కృత్రిమంగా పెంచుతున్నారు. ఆకర్శణీయంగా తీర్చిదిద్దిన చిన్నపాటి దేవాలయంలో గణపయ్యను కొలువుదీర్చి ఈ ప్రాంతానికి 'వినాయక వనం'గానూ నామకరణం చేశారు. ఎకో పార్కులో



ముఖ్య భాగమైన ధన్‌బాద్ చెరువు, రుద్రంపూర్ బృందావనాల నుంచి నేరుగా వినాయక వనానికి వచ్చే మార్గాన్ని ఇరువైపులా అందమైన ఉద్యానంగా తీర్చిదిద్దుతున్నారు. పర్యాటకుల విహారానికి త్వరలోనే బ్యాటరీలతో నడిచే వాహనాలను అందుబాటులోకి తేవాలనే యోచన కూడా ఉంది. తుది దశ మినహా, ఇతర ముఖ్యమైన పనులన్నీ పూర్తయి ఒకటిన్నర ఏడాది గడుస్తోంది. కనీసం మునుపటి పర్యాటక ప్రాంతాల సందర్శనకైనా అనుమతించడం లేదని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు. కొందరు మాత్రమే తమ పలుకుబడితో 'ఎకో పార్కు' అందాలను సందర్శిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పర్యాటకులను చెక్‌పోస్టుల వద్ద సెక్యూరిటీ గార్డులు నిలువరించడంపై ఆవేదన వ్యక్తమవుతోంది. "విజయవాడ జాతీయ రహదారి వద్ద ఎకో పార్కు విశిష్టతలపై భారీ హోర్డింగును ఏర్పాటు చేయనున్నాం. మరోవైపు బోటు విహారానికి సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలో తుది దశ పనులన్నీ పూర్తిచేసి పర్యాటకులను అనుమతించాల్సిందిగా అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తాం" – షాలేమురాజు, ఏరియా జీఎం

# డ్రైపోర్టుతో అభివృద్ధి జోడెడ్ల బండి!




సత్తుపల్లి : రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పోల్చిచూస్తే డ్రైపోర్టు ఏర్పాటుకు సత్తుపల్లి ఎంతో అనుకూలమైన ప్రదేశం. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సారైనా డ్రైపోర్టు కల నెరవేరాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

'సత్తుపల్లి' డ్రైపోర్టుపై ఆశలు చిగురిస్తున్నాయి. వీటి ఏర్పాటు ప్రతిపాదనలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తాజాగా తెరపైకి తెచ్చారు. డ్రైపోర్టుల నిర్మాణంలో భాగస్వాములు కావాలని విదేశీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో గత నెలలో సత్తుపల్లిలో బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్కును ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి తోడు డ్రైపోర్టును నిర్మిస్తే.. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.

**తగ్గనున్న దూరాభారం**

డ్రైపోర్టు ఏర్పాటుతో వస్తు (కార్గో) రవాణాకు వందలాది కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనివల్ల రూ.కోట్లల్లో ఆదా అవుతుంది. సత్తుపల్లి నుంచి కాకినాడకు 184, మచిలీపట్నంకు 170, కృష్ణపట్నంకు 420, విశాఖపట్టణానికి 325 కి.మీ. దూరం ఉంది. గన్నవరం విమానాశ్రయం 111 కి.మీ. దూరంలో ఉంది. రైల్వే స్టేషన్లను చూస్తే.. ఖమ్మం 90, కొత్తగూడెం 50 కి.మీ. దూరంలో ఉన్నాయి. రాష్ట్ర రాజధాని సత్తుపల్లి నుంచి 280 కి.మీ. దూరం ఉండగా.. ఇక్కడకు గ్రీన్‌ఫీల్డ్ హైవే కేవలం 8 కి.మీ. దూరంలోనే అందుబాటులో ఉంది. కాబట్టి.. హైదరాబాద్‌తో పాటు రాజమండ్రి, విశాఖపట్టణం, కోల్‌కత వంటి నగరాలకు వస్తు రవాణా మరింత సౌలభ్యంగా ఉంటుంది.

**వాణిజ్య, వ్యవసాయ రంగాలు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిశ్రమలకు నెలవు. ప్రతిష్ఠాత్మక సింగరేణి గనులతో పాటు భారీ థర్మల్ విద్యుత్తు కర్మాగారాలు, రెండు పామాయిల్ పరిశ్రమలు, మరో రెండు వనమూలికల మందుల తయారీ, గ్రానైట్ పరిశ్రమలు, శీతల గిడ్డంగులు, పేపరు మిల్లులు మొదలైనవి పెద్ద ఎత్తున విస్తరించి ఉన్నాయి. మరో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు సత్తుపల్లి నియోజకవర్గంలోనే 2025, ఫిబ్రవరి నెలలో శంకుస్థాపన జరగనుంది.

ఈ నేపథ్యంలో సత్తుపల్లి కేంద్రంగా డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే నిర్మాణ సంస్థకు, ప్రభుత్వానికీ లాభదాయకంగా ఉంటుందని ఆశిస్తున్నారు. ఇప్పటికే మెగాఫుడ్ పార్కు మొదలైంది. డ్రైపోర్టు కూడా ఏర్పాటైతే వ్యవసాయ, వాణిజ్య అవకాశాలు మరింత మెరుగవుతాయి. ప్రత్యక్షంగా 8 వేల మందికి, పరోక్షంగా మరో పది వేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు ఎగుమతులు, దిగుమతులు, ప్యాకింగ్ యూనిట్ల ఏర్పాటుతో పారిశ్రామిక వృద్ధి వేగంగా నమోదవుతుంది.

'మెగా ఫుడ్‌పార్కు ఉన్న సత్తుపల్లిలో డ్రైపోర్టు ఏర్పాటైతే పారిశ్రామికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. వ్యవసాయ అనుబంధ రంగం పురోగమిస్తుంది. కొత్త పరిశ్రమలు అందుబాటులోకి వస్తాయి. డ్రైపోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర మంత్రుల దృష్టికి తీసుకెళ్తా". – ఎం.రాగమయి, సత్తుపల్లి ఎమ్మెల్యే

# చదును చేస్తూ.. ఆక్రమిస్తూ

మెట్‌పల్లి : అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నా.. సంబంధిత అధికారుల పట్టింపులేనితనం, బాధ్యతారాహిత్యం వెరసి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. భూముల ఆక్రమణను 'మామూలు'గా తీసుకుంటుండడంతో విచ్చలవిడిగా చదును చేస్తూ దర్జాగా ఆక్రమిస్తున్నారు. ఆక్రమించడమే కాకుండా అక్రమార్కులు భూములను విక్రయిస్తున్నప్పటికీ కాపాడాల్సిన కొందరు అండదండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మెట్‌పల్లి మండలం రంగారావుపేట బీట్ కంపార్ట్‌మెంట్ 611/13 పరిధిలో సుమారు 1200 హెక్టార్లలో అటవీ భూమి విస్తరించి ఉన్నట్లు తెలుస్తోంది. రంగారావుపేట, ఆత్మకూర్, రామలచ్చక్కపేట, జగ్గాసాగర్, కేసీఆర్ తండా, పాటిమీదితండా, మెట్లచిట్టాపూర్, అల్లూరి సీతారామరాజుతండా, ఆత్మనగర్ తదితర గ్రామాల శివారుల్లో అటవీ భూమి ఉంది. ముఖ్యంగా రంగారావుపేట, ఆత్మకూర్, ఆత్మనగర్, అందుబొందుల తండా, పాటిమీదితండా, అల్లూరి సీతారామరాజుతండా, కేసీఆర్ తండా శివారుల్లో ఎక్కువగా ఉంది. కొందరు అక్రమార్కులు అవకాశం దొరికినప్పుడల్లా గుట్టుగా యంత్రాలతో అటవీ భూముల్లోని చెట్లు తొలగించి చదును చేస్తూ ఆక్రమిస్తున్నారు. ఆక్రమణలపై గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు ఆత్మనగర్ వాసులు విన్నవించగా ఆత్మకూర్ గ్రామస్థులు నిరసన తెలిపి ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల్లో చలనం కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**పోడు హక్కులు వస్తాయనే అపోహతో..**

గత ప్రభుత్వం అటవీ భూముల్లో సాగు చేస్తున్న వారికి హక్కులు ఇస్తామని ప్రకటించింది. మెట్‌పల్లి మండలంలో 309 మంది దరఖాస్తు చేసుకున్నా క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం విచారణ జరిపి అర్హులు ఎవరూ లేరని అధికారులు తేల్చారు. దీంతో తమకు భవిష్యత్తులోనైనా పోడు హక్కులు వస్తాయనే అపోహతో యథేచ్ఛగా అటవీ భూముల్లో చెట్లను నరికి ఆక్రమిస్తున్నారు.

**ఎకరానికి రూ.3 నుంచి రూ.6 లక్షలు**

ఆత్మకూర్, ఆత్మనగర్ శివారుల్లోని అటవీ భూములను ఆనుకుని కొన్ని సర్వేనంబర్లలో ప్రభుత్వం అసైన్డ్ భూములను కేటాయించింది. కొన్ని చోట్ల రెవెన్యూ, అటవీ శాఖల మధ్య హద్దులు తేలడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమార్కులు అసైన్డ్ పట్టాల పేరుతో అటవీ భూముల్లోకి చొరబడి ఆక్రమిస్తున్నారు. యంత్రాల సాయంతో చదును చేసి ఒక్కొక్కరు మూడు నుంచి 20 ఎకరాల వరకు ఆక్రమిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా రంగారావుపేట శివారులో కొందరు అటవీ భూములను విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యంత్రాలతో అటవీ భూములను చదును చేసి అమాయకులను మభ్యపెట్టి ఎకరానికి రూ. 3 నుంచి రూ. 6 లక్షల వరకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోడు హక్కులు వస్తాయన్న ఆశతో వారు కూడా కొనుగోలు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. గతంలో ఆక్రమణలపై వివాదం ఏర్పడడంతో అధికారులు రంగారావుపేటలో పికెటింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలను అడ్డుకునే యత్నం చేశారు. కొందరిపై కేసులు నమోదు చేశారు. అర్ధరాత్రి అటవీ భూములను చదును చేస్తున్న యంత్రాన్ని అడ్డుకోవడానికి వెళ్లిన ఓ అధికారిపై అక్కడున్న వారు దురుసుగా వ్యవహరించిన ఘటన చోటు చేసుకుంది. ఆ తర్వాత కొందరు అధికారులు బదిలీ, సెలవుపై వెళ్లారు. ఇదే అదనుగా మళ్లీ అక్రమణలకు తెర లేపగా, అడ్డుకోవాల్సిన ఒకరు 'మామూలు'గా సహకరించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల మెట్‌పల్లిలో ఓ అటవీ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడటం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తుంది.

# పత్తి రైతుకు భరోసా

పెద్దపల్లి: ఒక రైతు మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తికి వ్యాపారి క్వింటాలుకు రూ. 7 వేల చొప్పున ధర చెల్లించారు. ఈ మేరకు రైతుకు మద్దతు ధర కన్నా రూ. 521 తక్కువగా అందుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఇకపై ఆ మొత్తాన్ని కేంద్రం రైతు ఖాతాల్లోకి నేరుగా జమ చేయనుంది. 'ధర లోటు చెల్లింపు(పీడీపీ–ప్రైస్ డెఫిసెట్ పేమెంట్)గా పిలిచే ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఈ మేరకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. సన్న ధాన్యం పండించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న బోనస్ మాదిరిగానే పత్తి రైతులకు ఊరట కలిగించేందుకు కేంద్రం పీడీపీ విధానంపై కసరత్తు చేసింది. పత్తి ధరల్లో నెలకొన్న అనిశ్చితి నుంచి రైతులకు ఉపశమనం కలిగించేందుకు గిట్టుబాటు ధర అందని సమయంలో దీన్ని అమలు చేయనుంది. దేశీయ పత్తి మార్కెట్‌లో నాలుగైదేళ్లుగా నెలకొన్న ఇబ్బందుల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు కొనుగోలుదారులు ఖరీదు చేసిన ధరకు, సీసీఐ మద్దతు ధరకు మధ్య వ్యత్యాసాన్ని కూడా రైతు ఖాతాలో జమ చేయనుంది. పథకం అమలుపై ఈ నెల 18న నీతి ఆయోగ్ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది.

**వచ్చే ఏడాది నుంచి ప్రయోజనం** ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 1,64,945 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. స్థానికంగా సగటున ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున 13,14,112 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటివరకు నాలుగింట మూడు వంతుల మంది రైతులు విక్రయించారు. ఈ నెల 19 వరకు సీసీఐ 24,298 మంది రైతుల నుంచి 4,91,330 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. ఈ గణాంకాలను బట్టి సగం పత్తి ప్రైవేటు కొనుగోలుదారులు, దళారుల చేతుల్లోకి వెళ్లింది. ఈ మేరకు రైతులకు మద్దతు ధర దక్కకుండా పోయింది. తాజా నిర్ణయంతో వచ్చే ఏడాది నుంచి ఉమ్మడి జిల్లాలో 1,12,417 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. **అన్నదాతకు ఊరట** సాధారణంగా అంతర్జాతీయంగా డిమాండ్, సప్లయి ఆధారంగా పత్తి ధరలు నిర్ణయమవుతాయి. కరోనా అనంతరం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం పత్తి ధరలపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడిప్పుడే దేశీయ వస్త్ర పరిశ్రమ పనితీరు మెరుగవుతున్నా ఎగుమతులపై బంగ్లాదేశ్ సంక్షోభం ఇబ్బందికరంగా మారింది. వస్త్ర పరిశ్రమ రంగంలో బలమైన దేశంగా గుర్తింపు సాధించిన బంగ్లాలో ప్రస్తుతం వేలాది పరిశ్రమలు మూత పడటంతో మన పత్తికి డిమాండ్ లేకుండా పోయింది.

# ధాన్యం కొనుగోళ్లు.. మహిళలకు సిరులు

సిరిసిల్ల: ఒకవైపు కుటుంబ బాధ్యతలు చూస్తూనే మరోవైపు మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అండగా నిలుస్తున్నారు అతివలు.. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఏడేళ్లలో ధాన్యం కొనుగోలు చేసి రూ.9.87 కోట్ల కమీషన్ పొంది ఆదర్శంగా నిలుస్తున్నారు.

**సమన్వయంతో విజయం**

రైతులు పండించిన ధాన్యం సేకరణకు ప్రభుత్వం 2006లో ఐకేపీ కొనుగోళ్లు ప్రారంభించింది. తొలుత జిల్లాలో 58 సంఘాలు ఉండగా ఈ సీజన్‌లో 44 కేంద్రాలు సేకరిస్తూ సహకార సంఘాలకు దీటుగా నిలుసుస్తున్నాయి. జిల్లా ఆవిర్భావం నుంచి ఇప్పటికీ రూ.7.17 కోట్లు కమీషన్ రూపంలో పొందారు. 2023-24 సంవత్సరంలోని రెండు సీజన్‌లకు సంబంధించిన రూ.2.70 కోట్ల కమీషన్ ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉంది.

మహిళా సంఘాల్లోని బుక్ కీపర్, సభ్యురాలు, సీఏ కలిసి కేంద్రాల బాధ్యతలు చూసుకుంటున్నారు. అధికారులు, రైతులను సమన్వయం చేసుకుంటూ ధాన్యం మిల్లులకు సకాలంలో చేరేలా శ్రమిస్తున్నారు.



రైతుల డబ్బులు ఎప్పటికప్పుడు వారి ఖాతాలో జమ చేయిస్తున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ.32 చొప్పున కమీషన్‌ను సంఘాలకు అందించింది. జిల్లాలోని ఐకేపీ ద్వారా 2018-19 వరకు పలు మండలాల్లో సంఘాలకు వచ్చిన కమీషన్‌తో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సొంతంగా స్థలాలు కొనుగోలు చేశారు.

కోనరావుపేట మండల కేంద్రం, గంభీరావుపేట మండలం లింగన్నపేట, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో మహిళా సంఘం భవనాలు నిర్మించుకున్నారు.

2018 నుంచి కమీషన్‌గా వచ్చిన సొమ్ములో 45 శాతం జిల్లా సమాఖ్యకు, 45 శాతం స్త్రీనిధిలో డిపాజిట్ చేసుకుంటున్నారు. పదిశాతం కేంద్రాల నిర్వహణకు ఖర్చుచేస్తున్నారు.

బలోపేతం చేసుకుంటాం

మాకు వచ్చిన కమీషన్ డబ్బుల్లో నిర్వహణ ఖర్చులు పోను రూ.3 లక్షలతో మూడు గుంటల స్థలం తీసుకున్నాం. దీనిలో గ్రామ మహిళా సమాఖ్య భవనం నిర్మించుకున్నాం. ప్రతి సీజన్‌లో కొనుగోళ్లకు వచ్చే హమాలీలు, సుతిలి, గన్నీ సంచులను భద్రపర్చడం కోసం గోదాం పక్కన రూ.2 లక్షలతో రెండు గదుల భవనం నిర్మించాం. మిగిలిన వాటిని సంఘం సంఘం అభివృద్ధికి ఖర్చు చేయనున్నాం. వాటితో సంఘాన్ని బలోపేతం చేసుకుంటాం.

**సరిత, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు, గోపాల్‌రావుపల్లి**

**అవకాశాలు అందిపుచ్చుకోవాలి**

ప్రభుత్వం అందించే అవకాశాలను మహిళా సంఘాలు అందిపుచ్చుకొని ఆర్థికంగా బలపడాలి. ఏటా గ్రామ సంఘాల సభ్యులకు ధాన్యం కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తున్నాం. సమర్థంగా నిర్వహిస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు. వచ్చిన కమీషన్‌తో పలు సంఘాలు లాభాల బాటలో ఉన్నాయి. శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# రైతువేదిక.. నిధులు లేక

తిర్యాణి : సాగులో వస్తున్న మార్పులపై అన్నదాతలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గత ప్రభుత్వం రైతు వేదికలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 70 వ్యవసాయ క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించారు. వాటిలో ఏఈవో కోసం ప్రత్యేక గది, స్టోర్ రూం, సమావేశాల కోసం హాల్ ఏర్పాటు చేశారు. గతంలో ఒక్కో వేదికకు 120 కుర్చీలు, టేబుల్, మైక్‌లను ప్రభుత్వం పంపిణీ చేసింది. నెలనెలా నిర్వహణకు రూ.9 వేలు ఇస్తామని ప్రకటించింది. కొన్ని నెలలపాటు చెల్లించారు. రెండేళ్లకు పైగా ఈ నిధులు నిలిచిపోవడంతో ఏఈవోలు జేబులో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి.

ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం రూ.22 లక్షలు కేటాయించింది. ఈ నిధులు సరిపోక చాలా చోట్ల మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిర్మించలేదు. ప్రభుత్వానికి నివేదించి అదనపు బిల్లులు మంజూరు చేస్తామని అప్పట్లో ప్రజాప్రతినిధుల సూచనతో కొన్నిచోట్ల గుత్తేదారులు వీటిని ఏర్పాటు చేసినా.. ఇప్పటికీ బిల్లులు రాలేదని వాపోతున్నారు. 59 వేదికలకు విద్యుత్తు వసతి ఉంది. వీటికి రూ.9.93 లక్షలు బకాయిలు పేరుకుపోయాయి.

**రెండేళ్లకు పైగా ఎదురుచూపులు**జిల్లాలో 2022, ఆగస్టులో అయిదు నెలలకు సంబంధించి నిర్వహణకు రూ.31.50 లక్షలను అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. వీటిని ఏఈవోలకు అందించినట్లు



వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఆ తరువాత నుంచి ఇప్పటి వరకు దాదాపు 27 నెలలుగా నిధులు నిలిచిపోయాయి. నెలకు ఒక్కోదాని నిర్వహణకు రూ.9 వేల చొప్పున లెక్కిస్తే.. జిల్లాలోని 70 రైతు వేదికలకు ఏడాదికి రూ.6.30 లక్షలు అవుతాయి. 27 నెలలకు సంబంధించి రూ.1.70 కోట్లు బకాయిలు రావాలి.

**అంతర్జాల వసతిలేదు..**

రైతులకు వ్యవసాయ పరంగా సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రతి రైతునేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మండలానికో రైతు వేదికను ఎంపిక చేసి కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లోని 15 వేదికల్లో కార్యక్రమ నిర్వహణకు కంప్యూటర్, ఎల్‌ఈడీ తెర, మైక్ వంటివి అందించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పిస్తారు. అయితే అంతర్జాల సౌకర్యం లేక ఏఈవోలే సొంతంగా డాటాను వినియోగిస్తున్నారు.

**మంజూరైతే చెల్లిస్తాం శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి**

రైతు వేదికల నిర్వహణ నిధులు రెండేళ్లకు పైగా రావడంలేదు. రైతుల సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించినపుడు ఏఈవోలే ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వారికి చెల్లిస్తాం.

# మధ్యాహ్న భోజనం.. నాసిరకం



గంగాధర: సర్కారు బడుల్లో విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కొన్నేళ్లుగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. గత కొన్ని రోజులుగా గురుకులాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఘటనల నేపథ్యంలో మధ్యాహ్న భోజనం వండుతున్న తీరు, ఎలాంటి నిబంధనలు పాటించాలో కథనం.

ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు..రెండు రోజుల కిందట గంగాధర మండలం బూర్గుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా వైద్యం పొంది 17 మంది యథావిధిగా పాఠశాలకు హాజరయ్యారు. కొందరు పిల్లలు ఇళ్ల నుంచి తెచ్చుకున్న బాక్స్‌ల్లోనే భోజనం చేశారు. ఇటీవల పాఠశాలకు సరఫరా చేసిన బియ్యంతో వండిన అన్నం ముద్దగా మారి తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని పాఠశాలను సందర్శించిన డీఈవో జనార్దన్‌రావు తెల్చారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను కలిసి.. సమస్య వివరించి పాత బియ్యం అందించేలా చొరవ చూపుతామని పౌరసరఫరాల శాఖ డీఎం రజనీకాంత్ తెలిపారు.

ఈ నెల 12న తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబాపులే బాలుర గురుకుల పాఠశాలలో అన్నం ముద్దగా ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యామని వాపోయారు. కొత్త బియ్యం కారణంగానే ఇలా జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు సెలవిచ్చారు.

జిల్లాలో వివరాలు...

ప్రభుత్వ పాఠశాలలు : 722

విద్యార్థులు : 55,934

వంటలు వండే సమయంలో మార్గదర్శకాలు..

సరైన నీటిని వాడాలి. బోరుబావి నీరు కాకుండా కుళాయి లేదా శుద్ధజలాన్ని ఉపయోగించి బియ్యం ఉడికించాలి. బోరుబావి నీరు కఠినంగా ఉండి అన్నం నాణ్యతను ప్రభావితం చేస్తుంది. వండే ముందు బియ్యాన్ని నీటితో రెండుసార్లు శుద్ధి చేయాలి.

అన్నంలో జిగటును నివారించడానికి, వేడి నీటిలో కొద్ది మొత్తంలో ఎడిబుల్ ఆయిల్‌ను జోడించాలి. ఇది బియ్యం గింజలను వేరుగా ఉంచడానికి సహాయపడుతుంది.

వంట చేసేటప్పుడు అదనపు నీటిని జోడించకుండా ఉండాలి. కావాల్సిన ఆకృతిని సాధించడానికి అవసరమైన నీటిని మాత్రమే వినియోగించాలి. ఎందుకంటే ఎక్కువ నీరు మెత్తని బియ్యానికి దారి తీస్తుంది.

వంట చేసే ప్రదేశం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెట్ల కొమ్మల ఆకులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

కూరగాయలు శుభ్రంగా కడిగి వండాలి. పుచ్చుల్లాంటివి తీసివేయాలి.

నాణ్యమైన సరకులు వాడాలి.

కొత్త బియ్యంతోనే ఈ సమస్య

కొత్త బియ్యం వంటతోనే అన్నం ఉడికీ ఉడకక ఉండలుగా మారి విద్యార్థులు తినడానికి ఇబ్బంది పడుతున్నారని మా దృష్టికి వచ్చింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇవే సరఫరా చేశాం. ఆ బడుల్లో అప్పటికే ఉన్న పాత బియ్యంతో వంట చేయడంతో ఈ సమస్య రాలేదు. ఆహార పదార్థాలు, తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించాం. అధికారులకు చెప్పి మార్పిస్తాం. జనార్దన్‌రావు, డీఈవో

# మనం పీల్చేదిది రో'గాలే'..!



కరీంనగర్ : మనం నిత్యం పీల్చేది గాలి కాదు.. గరళం. అవునండీ.. ఇది నిజం. మనకు తెలియకుండానే గాలి కలుషితమవుతోంది. ఉమ్మడి జిల్లాలో వాయు కాలుష్యం గత కొన్నాళ్లుగా తీవ్రరూపం దాలుస్తోంది. పీల్చే గాలిని విషతుల్యం చేసే సూక్ష్మ ధూళికణాలు ఆరోగ్యానికి సవాలు విసురుతున్నాయి. కరీంనగర్, గోదావరిఖనిలాంటి పట్టణాల్లో ఉపకరణాలు ఏర్పాటు చేయగా వీటి తీవ్రత తెలుస్తోంది.. మిగతా పట్టణాల్లోనూ గాలి నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

సగటు క్యూబిక్ మీటరు గాలిలో సూక్ష్మ ధూళి కణాల పరిమాణ ప్రమాణాలు

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం 60 మైక్రోగ్రాములకు మించొద్దు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం 20 మైక్రోగ్రాములు దాటొద్దు.

వాయు కాలుష్యంతో 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతాయి. ఇందులో అతి సూక్ష్మ ధూళికణాలు (పీఎం 2.5) సూక్ష్మ ధూళి కణాలు (పీఎం 10), నైట్రోజన్ ఆక్సైడ్‌లు, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మొదలగు విష పదార్థాలుంటాయి. ఇందులో పీఎం 2.5, పీఎం 10 అత్యంత ప్రమాదకరమైనవి.

ఉమ్మడి జిల్లాలో రెండు నగర పాలక సంస్థలు, 14 పురపాలికల్లో కాలుష్యం ఎక్కువగా ఉంది. రోజుకు సగటున 400 వాహనాలు పెరుగుతుండటం, రోడ్ల విస్తరణ పనులు పెరగడంతో గాలిలో ధూళి పెరుగుతోంది. పంచాయతీలు, పురపాలికల్లో వ్యర్థాలను కాల్చడం కూడా ముప్పుగానే మారింది.

పంట కాలిస్తే ప్రమాదమే..!

ఉమ్మడి జిల్లాలో 8 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. ఇందులో దాదాపుగా 3లక్షల ఎకరాల్లో పంటకోత తరువాత కొయ్యలను పొలంలోనే కాలుస్తారు. టన్ను గడ్డి మండిస్తే అందులో నుంచి 2 కిలోల సల్ఫర్‌డైఆక్సైడ్, 3 కిలోల పార్టికల్ మీటర్, 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్‌డై ఆక్సైడ్, 199 కిలోల బూడిద ధూళి గాల్లో కలుస్తుంది. పొలాల్లో గడ్డిని కాల్చకుండా అందులోనే నీళ్లు పెట్టి కుళ్లిస్తే నేల మరింత సారవంతమవుతుంది.

పూర్తి స్థాయిలో లెక్కిస్తే..

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కరీంనగర్, గోదావరిఖనిలో రెండు చోట్లనే గాలి నాణ్యతను లెక్కిస్తుంది. మరెక్కడా లేవు.

కనీసం జిల్లాకు నాలుగైదు చోట్ల ఉపకరణాలు ఉంటే తీవ్రత పూర్తిస్థాయిలో తెలిసే వీలుంటుంది.

కరీంనగర్ డంపింగ్ యార్డు, రామగుండం థర్మల్ ప్రాజెక్టు, గనుల చెంతన గాలిలో ఉద్గారాలెక్కువ. ప్రధాన పట్టణాల్లో ఎక్కడా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం గాలి నాణ్యత ఉండదు.

ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో కరీంనగర్, గోదావరిఖని పట్టణాల్లో గాలి నాణ్యత సూచీ 100ను దాటింది. గోదావరిఖనిలో 111 వరకు నమోదైంది.

సమస్య వీటితోనే..

ధ్వంసమైన రోడ్లు

మట్టి రహదారులు

గనుల వద్ద దుమ్ము

పరిశ్రమల పొగ

పాత వాహనాల పొగ

డంప్‌యార్డు, చెత్త పొగ

పొలాల్లో పంటలకు నిప్పు

భవన నిర్మాణాల దుమ్ము

పాత వాహనాలతో నష్టం

గడవు తీరిన వాహనాలు పొగ రూపంలో ధూళికణాలు, నైట్రోజన్ ఆక్సైడ్ సహా కాలుష్య ఉద్గారాలను గాల్లోకి వదులుతాయి. ఉమ్మడి జిల్లాలో 2014 మార్చి వరకు 5.61లక్షల వాహనాలున్నాయి. ప్రస్తుతం ఆ సంఖ్య 11.20 లక్షలకు చేరింది. ఇందులో 15 ఏళ్లు దాటిన వాహనాలే 2లక్షలకుపైగా ఉండటంతో వాటినుంచి వెలువడే పొగ ప్రమాదకరంగా మారుతోంది.

ఇలా చేయాలి..

వ్యర్థాలను కాల్చడం మానేయాలి.

వాహనాల కాలుష్య తనిఖీ చేపట్టాలి.

పరిశ్రమలు కాలుష్యం తగ్గించే సాంకేతికతను వాడాలి.

ప్రమాదకర ఉద్గారాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

రోడ్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టి దుమ్ము, ధూళి తీవ్రత తగ్గించాలి.

మాస్క్‌ను విధిగా ధరించడం అలవాటు చేసుకోవాలి.

ఆరోగ్యానికి 'పొగ'

గాలిలో ప్రమాదకరమైన దుమ్ము, ధూళి కణాల వల్ల ఆరోగ్యం పాడవుతుంది. ఊపరితిత్తులు, గుండె, మెదడులపైన ప్రభావం పడుతుంది. పరిశ్రమల పొగ, నేల, రహదారులపై నుంచి లేచే ధూళి, గనుల నుంచి వెలువడే దుమ్ము. వాహనాల పొగ, బొగ్గు మసి, పుప్పొడి రేణువులు, వివిధ రకాల బూడిద గాల్లో తేలుతుంటాయి. ఇవి నేరుగా నోరు, ముక్కు ద్వారా మన శ్వాసకోశ నాళాల్లోకి సులభంగా వెళ్తాయి. ఈ గాలి పీల్చితే ఆస్తమా, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్), గుండెపోటు, క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. వసీం, ఛాతివ్యాధి నిపుణులు, కరీంనగర్

# కాసుల బాసులు..

ఆసిఫాబాద్: అత్యంత వెనుకబడిన జిల్లాలో అడుగడుగునా సమస్యలు ఉన్నాయి. కనీస మౌలిక వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరకు చేర్చి, పాలనను పట్టాలెక్కించాల్సిన అధికారులే దారి తప్పి ప్రవర్తించడం జిల్లావాసులకు శాపంలా మారుతోంది. ఈ చోటుకు రావడానికి వెనుకాడే అధికారులు ఒకవైపు, వచ్చిన వారు వీలయినంత సంపాదించాలనే దురుద్దేశంతో పనిచేయడం వల్ల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే తరహాలో మారుతోంది. గతంలో పనిచేసిన వారు ఇదేతీరున వ్యవహరించడం ఆ తర్వాత బదిలీపై వెళ్లడంతో కొత్తవారైనా తమ కష్టాలు తీర్చుతారనే ప్రజల ఆశలు ప్రతిసారీ అడియాసలవుతున్నాయి. తండ్రి చనిపోతే కారుణ్య నియామకం పరిధిలో రెండేళ్ల కిందట ఉద్యోగంలో చేరిన ఓ వ్యక్తి నేడు అక్రమార్జనకు చిరునామాగా మారాడు. బాసుల అండదండలు, మరో అధికారి సహకారంతో అయినకాడికి దండుకుంటున్నారు. జిల్లాలో చాలా మంది సీనియర్లు ఉండగా, ఓ అధికారి సదరు వ్యక్తిని తన దగ్గర పెట్టుకుని, వసూళ్ల దందాకు తెరతీశారనే ప్రచారం సాగుతోంది. ఏదైనా ఫైల్ ముందుకు కదలాలంటే, బాస్‌కు ఇస్తున్నారు కదా, నాకు ఇంత ఇవ్వాలనే డిమాండ్ పెడుతున్నాడు. సమస్యలను స్వయంగా గుర్తించి వారితోనే దరఖాస్తులు పెట్టించి పరిష్కరించేందుకు రూ.లక్షలు అడిగిన



తీరుపై అధికారులందరూ విస్మయానికి గురవుతున్నారు. జిల్లాలో చాలా అధికారులు అక్రమార్జనకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

**అక్రమాల తీరిది..**

జిల్లాలో పెట్రోల్‌బంక్ ఓ వ్యక్తికి మంజూరైంది. వివిధ రకాల అనుమతులు పొందే క్రమంలో ఫైల్ బాస్ దగ్గరకు వచ్చింది. బాస్ వెంటనే నమ్మినబంటుకు ఈ పని చక్కబెట్టాలని ఆదేశించాడు. అతను కొంత మొత్తం కావాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఆశ్చర్యపోయాడు. రూ.లక్షల్లో ఇచ్చుకోలేనని, తన వద్ద పత్రాలన్నీ సక్రమంగా ఉన్నాయని మొరపెట్టుకున్నా.. తన అనుచరుడి వద్దకు వెళ్లాలని బాస్ చెప్పడంతో బాధితుడు ఏం చేయలేని పరిస్థితి.

బడా గుత్తేదారుకు చెందిన భూమి ధరణిలో సమస్య ఉంది. దీనిని సరిచేయడానికి భారీ మొత్తంలో డిమాండ్ చేశారు. ఇంత ఇవ్వలేను చూడండని అనడంతో మరో అధికారి వీరి మధ్య డీల్ చేస్తున్నట్లుగా సమాచారం. జిల్లా వ్యాప్తంగా ధరణి సమస్యలు 1300 పైగా ఉన్నాయి. వీరి సమస్యలను పరిష్కరించే క్రమంలో వారికి సంప్రదించి, నచ్చినకాడికి తీసుకుంటున్నారు. మరోవైపు కొందరు వ్యక్తులతో స్వయంగా దరఖాస్తులు సమర్పించి, అనంతరం కాసులు తీసుకుని పనికానిచ్చేస్తున్నారు. ధరణి వెబ్‌సైట్ను ప్రభుత్వం త్వరలోనే రద్దు చేయనున్న నేపథ్యంలో అప్పటి వరకు వీలయినంత జేబులు నింపుకొందామని సదరు వ్యక్తుల దురాలోచనగా ఆరోపణలు ఉన్నాయి. సొంత వ్యక్తులు చనిపోయి పుట్టెడు దుఃఖంతో ఉండి, కారుణ్య నియామకాల కోసం తిరుగుతున్న బాధితుల నుంచి సైతం వసూళ్ల పర్వం కొనసాగుతుందని తెలుస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు బిర్యానీ, భోజనాలు పెట్టే వ్యక్తికి వచ్చిన బిల్లులో సైతం కమీషన్ కావాలని అడగడంతో సదరు హోటల్ యజమాని బిత్తరపోవాల్సి వచ్చింది. ఏ బిల్లులోనైనా 2 శాతం కమీషన్ కావాలని బాస్ అంటున్నాడని చిన్నబాస్ చెప్పడం, తనకు కొంత ఇవ్వాలని కోరడం, ఈ విషయం బయటకు పొక్కడంపై ప్రజలు అధికారుల తీరును చీదరించు కుంటున్నారు.

# సోయా విక్రయాలకు పడిగాపులు

ఆదిలాబాద్ : సోయా విక్రయాల్లో రైతులకు కొత్తకష్టాలు మొదలయ్యాయి. అన్నదాతల నుంచి కొనుగోలు చేసిన సోయా సంచులకు రైతు పేరున క్యూఆర్ కోడ్ జారీ అవుతుంది. దాన్ని సంచికి జత చేయాల్సి ఉంటుంది. గోదాంలకు పంపించిన తర్వాత కూడా ఏ కేంద్రం నుంచి ఏ రైతు నుంచి కొనుగోలు చేశారనే వివరాలు తెలుసు కునేందుకు వీలుగా సంచులపై క్యూఆర్‌కోడ్ జత చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం జిల్లాల వారీగా సోయా కొనుగోళ్ల లక్ష్యాన్ని విధించింది. జిల్లాలో లక్ష క్వింటాళ్ల సోయా కొనుగోలుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. అంచనాకు మించి సోయా మార్కెట్‌కు రావడంతో ఇప్పటి వరకు లక్ష్యానికి మించి సోయాను కొనుగోలు చేశారు. ఇతర జిల్లాలో పెద్దగా విక్రయాలు లేకపోవడంతో ఆయా జిల్లాలకు కేటాయించిన లక్ష్యాన్ని జిల్లాకు కేటాయించి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజులుగా సోయా కొనుగోళ్లకు సంబంధించిన అనుమతులు రాక, క్యూఆర్ కోడ్ జారీ కాలేదు. అప్పటికే సోయాను బస్తాలో నింపి రైతులు ఎదురుచూస్తున్నారు. జైనథ్ మార్కెట్‌లో క్యూఆర్ కోడ్లు రాక పేరుకుపోయిన సోయా నిల్వలు ఇవి. ఇక్కడ భారీగా సోయా రావడం, అవసరం మేరకు క్యూఆర్ కోడ్ స్లిప్పులు రాక సోయాను విక్రయించిన రైతులు మార్కెట్‌లోనే మూడు రోజులుగా చలిలోనే పడిగాపులు కాస్తున్నారు.

ఆదిలాబాద్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న సోయా ఇది. గతంలో విక్రయించిన సోయా సంచులు రవాణా కాక ఇతర రైతులు సోయాను మార్కెట్‌లోనే నిల్వ చేసుకొని విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు.

జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన దత్తు అనే రైతు ఈ నెల 21న సోయాను తీసుకొని రాగా, తేమ శాతం తదితర వాటిని పరిశీలించి కొనుగోలు చేశారు. తీరా క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి వచ్చే వరకు సోయా పంట బాధ్యత మీదే అని అధికారులు చెప్పడంతో రెండు రోజులుగా మార్కెట్‌లోనే ఉంటున్నాడు.

జైనథ్ మండలం సావాపూర్‌కు చెందిన రమేశ్ ఈ నెల 20న సోయాను విక్రయించేందుకు వచ్చారు. ఒకరోజు తర్వాత కొనుగోలు చేశారు. అప్పటి నుంచి క్యూఆర్ కోడ్ స్లిప్పులు లేవు. అవి రాగానే జత చేసిన వెళ్లాలని చెప్పడంతో నాలుగు రోజులుగా అక్కడే ఉన్నారు.

ఆందోళన అవసరం లేదు

ప్రవీణ్‌రెడ్డి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, ఆదిలాబాద్

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి రైతు నుంచి మద్దతు ధరతో సోయాను కొనుగోలు చేస్తాం. రోజు వారీగా కొనుగోలు చేసే మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో సోయా రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. క్యూఆర్ కోడ్ స్లిప్పులు జారీ కాగానే కేంద్రాలకు పంపిస్తున్నాం.



# పవన్ కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి

విజయనగరం: ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు, మక్కువ మండలం బాగోజాలలో పర్యటించారు. ఈ పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి పాల్గొన్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకిలీ ఐపీఎస్ అవతారం ఎత్తిన వ్యక్తిని విజయనగరం జిల్లా గరివిడికి చెందిన మాజీ సైనికుడు సూర్యప్రకాష్‌గా అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ చేపట్టారు.

# మన్మోహన్ సింగ్‌కు చివరి సెల్యూట్..!!





ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అంత్యక్రియలు ఆరంభం అయ్యాయి. దేశ రాజధానిలోని నిగమ్ బోధ్ ఘాట్ వద్ద అంత్యక్రియలను నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అధికార లాంఛనాలంతో ఈ కార్యక్రమం కొనసాగనుంది. డాక్టర్ మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయస్సు 92 సంవత్సరాలు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వరుసగా రెండుసార్లు ప్రధానమంత్రిగా పని చేశారాయన. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా, ఆ శాఖ మంత్రిగా పని చేశారాయన. ఆర్థిక వ్యవస్థకు జీవం పోశారు. ఈ ఉదయం కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అంతిమయాత్ర ఆరంభమైంది. మిలటరీ వాహనంపై నిగమ్ బోధ్ ఘాట్‌కు పార్థివదేహాన్ని అధికార, సైనిక లాంఛనాలతో తీసుకొచ్చారు. అక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత మల్లికార్జున్ ఖర్గే నివాళి అర్పించారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి మనీష్ గోబిన్.. ఆయనకు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సహా పలువురు మంత్రులు, అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరైన వారిలో ఉన్నారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా.. తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. చివరిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధాతప్త హృదయంతో నివాళి అర్పించారు. సెల్యూట్ చేశారు. ఆ సమయంలో అందరూ లేచి నిల్చుని మౌనం పాటించారు.

# ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు.. తెలుగువారికి గర్వకారణం: సీఎం చంద్రబాబు



విజయవాడ: ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు పెట్టడం అభినందనీయమని చెప్పారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ.. నిర్వాహకులకు చంద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఇది వైకాపా రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్: పవన్ కల్యాణ్



కడప: కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడారు. "గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును అమానుషంగా కొట్టారు. అధికారులపై దాడి చేయడం వైకాపాకు కొత్త కాదు. ఆధిపత్యం, అహంకారంతో అధికారులపై దాడులు చేస్తే ఎలాంటి శిక్షలు పడతాయో చూపిస్తాం. అహంకారంతో వైకాపా నేతలకు కళ్లు నెత్తికెక్కాయి. ఇది కూటమి ప్రభుత్వం.. వైకాపా రాజ్యం అనుకుంటున్నారా.. ఖబడ్దార్. ఇష్టారాజ్యంగా చేయలేరు. మీ అహంకారం ఎలా అణచివేయాలో మాకు తెలుసు. చేసి చూపిస్తాం. అధికారులపై దాడి చేస్తే తోలు తీస్తాం" అని పవన్ హెచ్చరించారు. పులివెందుల నియోజకవర్గంలో ఓ రైతు కుటుంబం ఆత్మహత్యపై పవన్ స్పందించారు. ఆ ఘటన బాధాకరమని.. దీనిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం రైతు తన భూమి మ్యుటేషన్ పెట్టుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ఈ ఘటన జరిగిందో నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సాంకేతికతతో నేరాలకు అడ్డుకట్ట: డీజీపీ ద్వారకా తిరుమలరావు



అమరావతి: విజయవాడలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో 2025 మార్చి 31 నాటికి లక్ష సీసీ కెమెరాలు అనుసంధానిస్తామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే 25 వేలకుపైగా సీసీ కెమెరాలను నేర నియంత్రణకు వినియోగిస్తున్నామన్నారు. గతంతో పోలిస్తే సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఈ ఏడాదిలో సైబర్ క్రైమ్‌కు సంబంధించి 916 కేసులు నమోదు కాగా.. సుమారు రూ.1,229 కోట్ల మేర నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని పేర్కొన్నారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని.. అలాంటి కాల్స్‌ను ప్రజలు నమ్మొద్దన్నారు. "కొత్తగా ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం.

గంజాయి, డ్రగ్స్ కేసుల వ్యవహారంలో 'ఈగల్' వ్యవస్థ ప్రజల్లోకి బలంగానే వెళ్తోంది. 10,380 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేసి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాల్సిందిగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా దేశంలోనే తొలిసారి ఏపీలో 'స్మార్ట్ పోలీస్ ఏఐ' వ్యవస్థను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం ఏలూరు జిల్లా పోలీసులు ఈ స్మార్ట్ పోలీస్ ఏఐను అమలు చేస్తున్నారు. కేసు నమోదు నుంచి విచారణ వరకూ ఈ స్మార్ట్ పోలీస్ ఏఐ విచారణాధికారికి సహకరిస్తుంది. ట్రాఫిక్, క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం విజయవాడ పోలీసులు 'ఏఐ వజ్రాస్త్రం' పేరిట ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నారు" అని డీజీపీ తెలిపారు. "డిప్యూటీ సీఎం భద్రతా వలయంలోకి నకిలీ ఐపీఎస్ రావడంపై విచారణ చేస్తున్నాం. అది భద్రతాపరమైన లోటు కాదని భావిస్తున్నాం. భూకబ్జాలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదు చేస్తున్నాం. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టుల వ్యవహారంపై ఇప్పటివరకూ 572 కేసులు నమోదయ్యాయి. ఈ తరహా కేసుల్లో నిందితులపై రౌడీషీట్, సైబర్ షీట్‌లను నమోదు చేస్తున్నాం" అని డీజీపీ వెల్లడించారు.




# సంక్రాంతి ప్రయాణికులకు ఆర్టీసీ అదిరిపోయే న్యూస్..!

అమరావతి : ఈసారి సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఏపీకి రావాలనుకునే వారి రద్దీని తట్టుకునేందుకు వీలుగా ఎప్పటిలాగే స్పెషల్ బస్సుల్ని నడపాలని నిర్ణయించింది. ఈసారి సంక్రాంతి సీజన్ లో ఏకంగా 2400 ప్రత్యేక బస్సుల్ని నడపనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. అలాగే వీటిలో ప్రత్యేక ఛార్జీలపైనా స్పష్టత ఇచ్చేశారు. హైదరాబాద్ నుంచి ఏపీకి సంక్రాంతి సీజన్ లో ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా ఈసారి 2400 ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. వీటిలో హైదరాబాద్ నుంచి విజయవాడ, తిరుపతి, వైజాగ్ తో పాటు ఏపీలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలకు ప్రత్యేక సర్వీసుల్ని కేటాయించారు. వీటి లక్ష్యం సంక్రాంతికి హైదరాబాద్ నుంచి స్వస్థలాలకు రావాలనుకునే వారికి వెసులుబాటు ఇవ్వడమే. ఈ ప్రత్యేక బస్సులు జనవరి 9 నుంచి 13వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ పేర్కొంది అలాగే ఈసారి ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీల భారం కూడా ఉండబోదని ఏపీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. గతంలో పండుగల సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల్లో ప్రత్యేక ఛార్జీల మోత ఉండేది. కానీ కొంతకాలంగా ఆర్టీసీ ఇలా పండుగల రద్దీని అడ్డుపెట్టుకుని అదనపు ఛార్జీలు వసూలు చేసే విధానానికి చెక్ పెట్టింది. ఈసారి కూడా సంక్రాంతికి అదనపు ఛార్జీలు లేకుండానే రెగ్యులర్ బస్సుల తరహాలోనే ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెప్తున్నారు.



# చంద్రబాబు ఆపకపోతే నా భార్య అరెస్టు-వైసీపీ మాజీ మంత్రి షాకింగ్..!

మచిలీపట్నం : ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చాక తమను టార్గెట్ చేస్తున్నారని వైసీపీ నేతలు గగ్గోలు పెడుతూనే ఉన్నారు. అయితే తాజాగా రేషన్ బియ్యం స్కాం పేరుతో వైసీపీ నేతల్ని ప్రభుత్వం టార్గెట్ చేస్తుండటంతో వీరిలో కొందరు అజాతంలోకి కూడా వెళ్లిపోతున్నారు. ఇదే క్రమంలో మచిలీపట్నంకు చెందిన వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం కూడా రేషన్ బియ్యం స్కాంలో ఉందంటూ ఆరోపణలు రావడంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి మరీ వీరి అరెస్టుకు ప్రయత్నిస్తున్నారు.

ఈ నేపథ్యంలో వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని ఇవాళ మీడియా ముందుకు వచ్చారు. రేషన్ బియ్యం స్కాంలో తమ కుటుంబం తప్పేమీ లేదన్నారు. తమ గోడౌన్ లో పౌరసరఫరాల శాఖ దాచుకున్న రేషన్ బియ్యం అదృశ్యమైన వ్యవహారంలో టెక్నికల్ గా తమ తప్పేమీ లేకపోయినా నైతిక బాధ్యతగా అధికారులకు సహకరిస్తున్నట్లు పేర్ని చెప్పుకొచ్చారు. అయితే రేషన్ బియ్యం వ్యవహారంలో విచారణ పూర్తి కాకపోయినా సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారని విమర్శించారు. రేషన్ బియ్యం కుంభకోణంలో తన తప్పేమీ లేదని, తన తల్లి మీద ప్రమాణం చేసి చెబుతున్నానని పేర్ని నాని తెలిపారు. ఈ కేసులో తన భార్య జయసుధను అరెస్టు చేయించేందుకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

తాము ఎక్కడికీ పారిపోలేదన్నారు. తనపై ప్రతీకారం తీర్చుకోవాలని ఇంట్లో ఆడవాళ్లను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. గోడౌన్ మేనేజర్ ను అరెస్టు చేసి తన భార్య పేరు చెప్పించాలని ప్లాన్ చేశారన్నారు. రాజకీయ కక్ష ఉంటే తనపై తీర్చుకోకుండా ఇంట్లో ఆడవాళ్లతో ఏం పని అని పేర్ని ప్రశ్నించారు. కొల్లు రవీంద్ర ఎన్నిసార్లు చంద్రబాబును కలిసి తన భార్య జయసుధను అరెస్టు చేద్దామని ఒత్తిడి తెచ్చినా ఆయన మాత్రం ఒప్పుకోలేదన్నారు. చంద్రబాబు మాత్రం మైండ్ చెడిందా, ఆడోళ్లను అరెస్టు చేయడమేంటి? అవసరమైతే పేర్ని నాని, ఆయన కొడుకుని అరెస్టు చేసుకోమన్నారన్నారు. చంద్రబాబుతో తమకు రాజకీయ వైరం ఉన్నా ఈ విషయంలో మాత్రం ఆయన హుందాగా ప్రవర్తించారన్నారు.

# ఘనంగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం



విజయవాడ: మాతృ భాషను భవిష్యత్తు తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా.. ప్రపంచ ఆరో తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు వీరు తెలుగు తల్లి విగ్రహానికి అంజలి ఘటించారు. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, విశ్వహిందీ పరిషత్తు జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, ఈనాడు ఏపీ సంపాదకుడు ఎం. నాగేశ్వరరావు, తెలంగాణ శాసనమండలి సభ్యుడు, కవి గోరటి వెంకన్న, సినీ గేయ కవి భువనచంద్ర, ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు మహాసభల్లో పాల్గొన్నారు.

సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలుగు మహనీయుల ఫొటో ప్రదర్శనను అతిథులు తిలకించారు. నగరంలోని కె.బి.ఎన్.కళాశాల ప్రాంగణంలో నేటి నుంచి రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల కోసం దేశవిదేశాల నుంచి 1500 మందికి పైగా కవులు, రచయితలు, భాషాభిమానులు తరలివచ్చారు. పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణంలోని చెరుకూరి రామోజీరావు ప్రధాన వేదికతో పాటు మరో రెండు వేదికలనూ.. సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాల కోసం సిద్ధం చేశారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణా జిల్లా రచయితల సంఘం, కె.బి.యన్.కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. మహాసభల్లో భాగంగా చెరుకూరి రామోజీరావు ప్రధాన వేదికతో పాటు మరో రెండు వేదికలపై రెండు రోజుల్లో 25కు పైగా సదస్సులు, కవితా, సాహిత్య సమ్మేళనాలు జరుగుతాయి. వీటిలో 800 మందికి పైగా భాషాభిమానులకు వేదికలపై పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. వెయ్యి మందికి పైగా దివంగతులైన ప్రముఖ కవుల ముఖచిత్రాలతో మహాసభల ప్రాంగణంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రాంగణంలోని అన్ని ప్రాంతాల్లోనూ కనిపించేలా దారిపొడవునా కవుల ముఖచిత్రాలే దర్శనమిస్తున్నాయి. రాజకీయ, న్యాయ, పరిపాలనలో తెలుగు ప్రాధాన్యం పెంచే దిశగా ప్రత్యేక సదస్సులు జరుగుతాయి.

పత్రికలు, ప్రసార మాధ్యమాలు, ప్రచురణ సంస్థల్లో మాతృభాష ప్రాధాన్యంపైనా సదస్సులు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాలు, మహిళా ప్రతినిధులకు ప్రత్యేకంగా సదస్సులు, తెలుగు భాషా పరిశోధనపై, సాహితీ, విద్యారంగ ప్రముఖులు, భాషోద్యమం, శాస్త్రసాంకేతిక రంగం.. ఇలా అన్నింటిలోనూ మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలనే కోణంలో కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించనున్నారు.

# పరకామణిలో రూ.100 కోట్ల కుంభకోణం: భానుప్రకాశ్‌రెడ్డి

అమరావతి: తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భాజపా ప్రతినిధుల బృందం ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసింది. తిరుమల పరకామణి కేసు విషయంలో ఆయనకు నేతలు ఫిర్యాదు చేశారు. తితిదే పరకామణిలో విదేశీ డాలర్లు మాయం ఘటనపై విచారణ చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు భానుప్రకాశ్‌రెడ్డి, పాతూరి నాగభూషణం నాలుగు పేజీల లేఖను డీజీపీకి అందజేశారు. సమగ్ర విచారణ జరపాలని కోరారు. పరకామణిలో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. రహస్య అర అమర్చి డబ్బులు తరలించారని చెప్పారు. తరలించిన మొత్తాన్ని వెనక్కి రప్పించాలని డీజీపీని భాజపా బృందం కోరింది.



## వరుస ఫ్లాప్స్ పడ్డా 'లక్కీ మీనాక్షి'

2021లో ఇచ్చుట 'వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా అందంతో పాటు నటనతో మెప్పించింది. లక్కీగా త్రివిక్రమ్‌తో పాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడికి 2024లో పెద్ద ఎత్తున ఆఫర్లు వచ్చాయి. ఈ ఏడాది మీనాక్షి చౌదరి నటించిన ఆరు సినిమాలు వచ్చారు. సంక్రాంతికి గుంటూరు కారం సినిమా విడుదల కాగా ఆ తర్వాత పలు సినిమాలు విడుదల అయ్యాయి. తెలుగులో ఈమె దుల్కర్ సల్మాన్‌తో నటించిన లక్కీ భాస్కర్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, నటిగానూ మంచి మార్కులు సొంతం చేసుకుంది. ఈ ఏడాది మొత్తం ఆరు సినిమాల్లో తెలుగులోనే ఈమె నటించిన నాలుగు సినిమాలు విడుదల అయ్యాయి. అందులో లక్కీ భాస్కర్ సినిమా మినహా గుంటూరు కారం, మట్కా, మెకానిక్ రాకీ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడ్డాయి. ఆ సినిమాలు ఫ్లాప్ అయినా ఈమెకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టాయి. సినిమాల్లో ఈమెకు ఆఫర్లు తెచ్చి పెడుతూనే ఉన్నాయి. కోలీవుడ్‌లో ఈ అమ్మడు ది గోట్ సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో



అక్కడ కూడా ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ముఖ్యంగా ఈమె టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీ బిజీగా కనిపించబోతుంది. టాలీవుడ్‌లో 2025లో సంక్రాంతికి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో మీనాక్షి చౌదరి పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతుంది. మరో వైపు నవీన్ పొలిశెట్టి దర్శకత్వంలోనూ అనగనగా ఒకరాజు సినిమాలో నటిస్తోంది. ఆ సినిమా వచ్చే ఏడాది సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరో వైపు రెండు మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఒకటి రెండు సినిమాలు కోలీవుడ్‌లోనూ చేసేందుకు రెడీ అవుతోంది. హిందీ నుంచి ఈమెకు ఆఫర్లు వస్తున్నాయని, కానీ మొత్తం దృష్టి సౌత్ సినిమాలపైనే అంటూ వార్తలు వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఆరు సినిమాలతో వచ్చిన మీనాక్షి చౌదరి వచ్చే ఏడాదిలో అంతకు మించి అన్నట్లుగా సినిమాలతో వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆ సినిమాల్లో మరో రెండు మూడు హిట్ కొట్టినా స్టార్ హీరోల జాబితాలో ఈ అమ్మడు చేసే అవకాశాలు ఉన్నాయి. వరుసగా ఫ్లాప్స్ పడ్డా మంచి సినిమాల్లో, క్రేజీ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకుంటున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని పెద్ద హీరోల సినిమాల్లో ఛాన్స్ దక్కించుకుంటుందనే విశ్వాసంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ మీనాక్షి చౌదరికి మంచి క్రేజ్ ఉంది.

## మయోసైటిస్‌తో సాహసోపేతమైన జర్నీపై సమంత

వ్యక్తిగతంగా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా సమంతా రూత్ ప్రభు సాహసోపేతమైన ప్రయాణం స్ఫూర్తిని నింపుతోంది. నాగ చైతన్యతో విడాకుల తర్వాత సామ్ ఊహించని కొత్త సవాళ్లను ఎదుర్కొంది. ఇటీవల గలాట్టా ఇండియా ఇంటర్వ్యూలో విడాకులపై సామాజిక తీర్పు, కళంకం, భావోద్వేగాల గురించి సమంతా మాట్లాడారు. ఓ స్త్రీ విడాకులు తీసుకుంటే, దానితో పాటే చాలా అవమానం, కళంకం అంటగడతారు. నన్ను సెకండ్ హ్యాండ్.. అని.. యూజ్డ్ అని లెక్కలేనన్ని కామెంట్లు చేసారు. వృథా జీవితం.. అపరాధం అంటూ అవమానించి సమాజం ఒక మూలకు నెట్టివేస్తుంది. ఇది కుటుంబాలకు కూడా చాలా కష్టం... అని తన ఆవేదనను వ్యక్తం చేసారు. వ్యక్తిగత జీవితాల్లో పురుషుల కంటే స్త్రీలు ప్రజల నుంచి కఠినమైన పరిశీలనను ఎదుర్కొంటారని అన్నారు. కొన్నేళ్లుగా నేను



నా జీవితం గురించి అవాస్తవ కథనాలను చదివాను. చాలా సార్లు నేను మాట్లాడాలని, నిజం చెప్పాలని అనుకున్నాను.. కానీ వెనక్కి తగ్గాను. నేను నాతో నేను మాట్లాడుకున్నాను. కథను మీ వైపు చెప్పడం ద్వారా మీరు ఏం పొందాలనుకుంటున్నారు? మద్దతు ఒకవైపే ఉండవచ్చు.. ఈరోజు మీకు మద్దతిచ్చే వ్యక్తులు రేపు చిన్న కారణంతో మీకు వ్యతిరేకంగా మారవచ్చు.. అని కూడా సమంత ఇంటర్వ్యూలో అన్నారు. నేను విడాకులు తీసుకున్నాను.

నా జీవితం ఒక అద్భుత కథ కాదు కానీ దాని అర్థం నేను ఒక మూలన కూర్చుని ఏడుస్తూ ఉంటాను అని కాదు. ఇది నా మార్గం.. కానీ నా జీవితం ఇక్కడితో ముగియదు అని కూడా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సమంత వ్యక్తిగతంగా చాలా కోలుకుని వృత్తిపరంగానూ దూసుకువెళుతున్న సంగతి తెలిసిందే.

**మయోసైటిస్ అలా మొదలైంది:** మరో ఇంటర్వ్యూలో మయోసైటిస్ గురించి మాట్లాడుతూ.. ఈ రుగ్మత ఎలా మొదలైందో ఆరంభం అర్థం కాలేదని అన్నారు. కరణ్ జోహార్ తో %–%కాఫీ విత్ కరణ్%–% షోని పూర్తి చేసుకుని హైదరాబాద్ కి వచ్చేశానని, ఖుషి షూటింగుకి వచ్చానని సమంత అన్నారు. కానీ అక్కడ నీరసంగా అనిపించింది. శరీరం పని చేయనట్టు షట్ డౌన్ అయిపోయింది. ఆ తర్వాతా ఆ సమస్యను పెద్దగా ఎదుర్కొన్నాను. నెమ్మదిగా మయోసైటిస్ అని తెలిసింది అని సమంత తెలిపారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు.. కోలుకోవడానికి చాలా సమయం పడుతోంది. ఇంకొంత కాలం పట్టొచ్చని కూడా సమంత అన్నారు.




## నేపాల్‌లో ఇండియన్ సినిమాలు.. పుష్ప 2 ఏకంగా టాప్ ప్లేస్‌లో!




ఇండియన్ సినిమాలు సౌత్ ఆసియాలో విస్తృతంగా ప్రభావం చూపుతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ సినిమాలు మాత్రమే కాదు, ప్రస్తుతం తెలుగు, కన్నడ వంటి ప్రాంతీయ చిత్రాలు కూడా గ్లోబల్ స్టేజ్‌పై పట్టు సాధిస్తున్నాయి. ఇందులో కీలకంగా నిలిచింది అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2: ది రూల్'. నేపాల్ బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా అత్యధిక కలెక్షన్లు సాధించి నెంబర్ వన్ స్థానం దక్కించుకోవడం విశేషం. 22 రోజుల పాటు సాలిడ్ కలెక్షన్లతో దూసుకెళ్లిన ఈ చిత్రం నేపాల్‌లో రూ.25 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఇది తెలుగు సినిమా ఖ్యాతిని మరో స్థాయికి తీసుకెళ్లినట్టే. స్థానిక ప్రేక్షకులు 'పుష్ప 2'లో ఉన్న మాస్ ఎలిమెంట్స్, అల్లు అర్జున్ స్టైల్, సుకుమార్ డైరెక్షన్‌కి ఫిదా అయ్యారు. ఈ సినిమాకి రష్మిక మందన్నా, ఫహద్ ఫాజిల్ వంటి నటీనటుల అద్భుతమైన ప్రదర్శన కూడా కలిసొచ్చింది. పుష్ప 2 తర్వాతి స్థానంలో కన్నడ సినిమా 'కేజీఎఫ్ చాప్టర్ 2' నిలిచింది. ఈ సినిమా నేపాల్‌లో రూ.19 కోట్ల గ్రాస్ సాధించింది. యశ్ నటన, ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌కి అక్కడి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అత్యుత్తమ యాక్షన్ సీన్స్, గ్లోబల్ లెవెల్ మేకింగ్ ఈ సినిమాను నేపాల్ బాక్సాఫీస్‌లో బిగ్ హిట్‌గా నిలిపాయి. అసలు ఆ సినిమా అక్కడ ఆ రేంజ్ లో హిట్ అవుతుందని ఎవరు ఊహించలేదు. ఇక రాజమౌళి డైరెక్ట్ చేసిన 'బాహుబలి 2' కూడా నేపాల్‌లో అత్యంత ఆదరణ పొందింది. రూ.15 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఈ చిత్రం ఓ రికార్డు సాధించింది. ఈ సినిమాతో తెలుగు సినిమాకు ఆ దేశంలో కూడా ప్రాముఖ్యత పెరిగింది. అంతే కాకుండా, షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' రూ.13.2 కోట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ సినిమా బాలీవుడ్ పవర్‌ని అక్కడి ప్రేక్షకులకు మరింత దగ్గర చేసింది. ఇక 'జవాన్' కూడా రూ.13 కోట్లతో 'పఠాన్'కి దగ్గరగా నిలిచింది. షారుక్ ఖాన్ క్రేజ్ నేపాల్‌లో ఏ స్థాయిలో వుందో ఈ కలెక్షన్లే నిరూపిస్తున్నాయి. ఇక 'ఆర్ఆర్ఆర్', 'యానిమల్', 'స్త్రీ 2' వంటి సినిమాలు సైతం రూ.10 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి తమదైన ముద్ర వేశాయి. ఈ ఫలితాలు నేపాల్‌లో భారతీయ సినిమాల పట్ల గల క్రేజ్‌ను స్పష్టం చేస్తున్నాయి. ఈ కలెక్షన్లు కేవలం సినిమాల విజయాన్నే కాకుండా, నేపాల్ ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పును కూడా చూపిస్తున్నాయి. ఒకప్పుడు నేపాల్ లో ఇండియన్ సినిమాలకు 10 కోట్లు వస్తే చాలా గ్రేట్. కానీ ఇప్పుడు అంతకుమించిన కలెక్షన్స్ వస్తున్నాయి. ఈ ప్రదర్శన భారతీయ సినిమా గ్లోబల్ మార్కెట్‌లో మరింత పాగా వేయడానికి దోహదపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పుష్ప 2 వంటి చిత్రాలు మరిన్ని సౌత్ సినిమాలకు కొత్త మార్గాలను సృష్టిస్తున్నాయని చెప్పవచ్చు.

## రాజాసాబ్ ట్రీట్ ఎప్పుడు.. రెబల్ ఫ్యాన్స్ వెయిటింగ్..!



రెబల్ స్టార్ ప్రభాస్ కల్కి తో సెన్సేషనల్ హిట్ అందుకున్నాడు. కల్కి 2898 %ఊణ% సినిమాతో మరోసారి తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు. ఐతే నెక్స్ట్ మారుతి డైరెక్షన్ లో రాజా సాబ్ సినిమాను చేస్తున్న ప్రభాస్ ఆ సినిమాతో మరోసారి తన సత్తా చాటాలని చూస్తున్నాడు. సలార్, కల్కి లాంటి డిఫరెంట్ సినిమాలు చేస్తున్న ప్రభాస్ సడెన్ గా మారుతి డైరెక్షన్ లో సినిమా చేయాలన్న ఆలోచన ఎందుకు వచ్చిందో కానీ ఈ సినిమా థ్రిల్లర్ జోనర్ లో ఆడియన్స్ ని థ్రిల్ చేస్తుందని అంటున్నారు. కామెడీ మీద మంచి పట్టున్న మారుతి రాజా సాబ్ సినిమాతో నెక్స్ట్ లెవెల్ కి వెళ్తాడని తెలుస్తుంది.

ఐతే సినిమా నుంచి ఇప్పటివరకు కేవలం ఒక గ్లింప్స్ ఇంకా మోషన్ పోస్టర్ మాత్రమే వచ్చాయి. గ్లింప్స్ లో ప్రభాస్ స్టైలిష్ లుక్ ఇంప్రెస్ చేయగా మోషన్ పోస్టర్ ఆడియన్స్ కు షాక్ ఇచ్చింది. మారుతి ఈసారి ఏదో పెద్దగానే ప్లాన్ చేసినట్టు మోషన్ పోస్టర్ చూస్తే అర్ధమవుతుంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. సినిమా మీద నిర్మాతలు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఐతే సినిమా నుంచి ఇప్పటివరకు వచ్చిన అప్డేట్స్ ఫ్యాన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేయగా రాజా సాబ్ టీజర్ కోసం ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజా సాబ్ టీజర్ ని కుదిరితే జనవరి 1 న్యూ ఇయర్ సందర్భంగా రిలీజ్ చేయాలని చూస్తున్నారు. ప్రభాస్ రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అవుతుంది మాళవిక మోహనన్. మలయాళ భామ అయిన మాళవిక డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే కానీ డైరెక్ట్ తెలుగు సినిమా ఇదే అవ్వడం విశేషం. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాపై అంచనాలు కూడా భారీగా ఉన్నాయి. మారుతి ప్రభాస్ కలిసి చేస్తున్న రాజా సాబ్ పై ఎక్స్ పెక్టేషన్స్ భారీగానే ఉన్నాయి. మరి వాటికి తగినట్టుగా సినిమా ఉంటుందా లేదా అన్నది చూడాలి. ప్రభాస్ రాజా సాబ్ సినిమాను 2025 ఏప్రిల్ 10న రిలీజ్ లాక్ చేశారు. నెక్స్ట్ సమ్మర్ కి రెబల్ స్టార్ రాజా సాబ్ ఫ్యాన్స్ కు సూపర్ ట్రీట్ ఇచ్చేందుకు వస్తున్నాడు.

## పూజా ఇదేం మాస్ విధ్వంసం బాబోయ్..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డే కెరీర్ దాదాపు ముగిసింది.. ఇక అమ్మడు ఏం చేసినా అవకాశాలు రావనుకున్న వారందరికీ ఆమె చేస్తున్న సినిమాల లిస్ట్ చూసి ఫ్యూజులు అవుట్ అయ్యాయి. తెలుగులో రాధే శ్యాం, ఆచార్య.. తమిళ్ లో బీస్ట్.. హిందీలో కిసి కా భాయ్ కిసి కి జాన్ ఫలితాలన్నీ నిరాశ పరచడంతో పూజా హెగ్డే కెరీర్ రిస్క్ లో పడింది. గత రెండేళ్లుగా పూజా కి అసలే మాత్రం టైం కలిసి రాలేదు. ఐతే అమ్మడు మాత్రం ఏమాత్రం కాన్ఫిడెన్స్ లూజ్ అవ్వకుండా ఉంటూ వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తున్న పూజా హెగ్డే ఆ సినిమాతో తిరిగి ఫాం లోకి రావాలని చూస్తుంది. ఐతే అనూహ్యంగా పూజాకి వరుస సినిమా ఛాన్స్ లు వస్తున్నాయి. ఇప్పటికే సూర్య రెట్రోలో ఛాన్స్ దక్కించుకున్న పూజా హెగ్డే నెక్స్ట్ దళపతి విజయ్ చివరి సినిమాలో కూడా అవకాశం పట్టేసుకుంది. అదే తమిళ్ లో లారెన్స్ తో కలిసి కాంచనా 4లో



కూడా ఛాన్స్ పట్టేసిందని తెలుస్తుంది. కోలీవుడ్ లో ఒకేసారి 3 సినిమాల ఆఫర్ అందుకున్న పూజా బేబ్ ఆ సినిమాతో అదరగొట్టబోతుందని చెప్పొచ్చు. ఇక మరోపక్క హిందీలో కూడా పూజా నెక్స్ట్ వరుణ్ ధావన్ చేస్తున్న సినిమాలో కూడా ఆమె నటించబోతున్నట్టు తెలుస్తుంది. ఇదే కాకుండా తెలుగులో ఎస్.ఎల్.వి సినిమాస్ నిర్మిస్తున్న సినిమాలో దుల్కర్ సల్మాన్ హీరోగా చేస్తుండగా ఆ సినిమాలో కూడా పూజా హెగ్డే లక్కీ ఛాన్స్ పట్టేసిందట. ఇలా వరుసగా ఐదారు సినిమాలతో పూజా కంబ్యాక్ ఒక రేంజ్ లో ఉండబోతుందని అనిపిస్తుంది. మొన్నటిదాకా చేతిలో సినిమాలు లేక డైలమాలో ఉన్న పూజా ఇప్పుడు ఒకేసారి సినిమాలన్నీ రావడంతో ఫుల్ హ్యాపీగా ఉంది. పూజా హెగ్డే ఈ మాస్ విధ్వంసం చూస్తే మాత్రం ఫ్యాన్స్ అంతా కూడా ఫుల్ ఖుషి అవుతున్నారు. పూజా బేబి ఈ సినిమాలతో మరోసారి తన సత్తా చాటనుంది. ఐతే ఇందులో కొన్ని పాత్ర ప్రాధాన్యత ఉన్న సినిమాలు కూడా ఉన్నట్టు తెలుస్తుంది. ఐతే పూజా హెగ్డే మాత్రం తన గ్లామర్ తో ఆడియన్స్ కి మరోసారి ట్రీట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నట్టు తెలుస్తుంది. ఐతే అంతా బాగుంది కానీ అమ్మడు తెలుగులో కూడా వరుస సినిమాలు చేస్తే చూడాలని అమ్మడి తెలుగు ఫ్యాన్స్ కోరుతున్నారు.

## నభా స్టైల్ ఐకాన్ 2.0 .. ఎందుకో తెలుసా?

2022లో కార్ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నభా నటేష్ ఆ తర్వాత కోలుకోవడం మిరాకిల్. ప్రమాదంలో ఈ భామ భుజం విరిగింది. చాలా చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. చాలా శస్త్ర చికిత్సలు జరిగాయి. అన్నిటి నుంచి కోలుకుని ఇప్పుడిలా వేడెక్కించే ఫోటోషూట్లతో గుబులు రేపుతోంది. వరుసగా సినిమాల్లో నటిస్తూ బిజీ అవుతోంది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత చాలా గ్యాప్ వచ్చింది. ఓటీటీ చిత్రం మ్యాస్ట్రోతో వచ్చినా అంతగా గుర్తింపు దక్కలేదు. ఇప్పుడు నిఖిల్ సరసన స్వయంభు లాంటి పాన్ ఇండియా చిత్రంలో అవకాశం అందుకుంది. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్న నాగబంధం అనే చిత్రంలో నటిస్తోంది. ఇందులో విరాట్ కర్ణ తన సహనటుడు కాగా అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోంది. కరోనా మహమ్మారీ, యాక్సిడెంట్ లాంటి కష్ట కాలం తనను చాలా సరి చేసిందని ఇప్పుడు తాను ఆలోచించే విధానం మునుపటితో పోలిస్తే పూర్తిగా మారిందని



కూడా నభా ఇటీవలి ఇంటర్వ్యూలో తెలిపింది. ఏది ఏమైనా కానీ నభా ఎప్పటికీ సోషల్ మీడియా క్వీన్ గా మెరిపిస్తూనే ఉంది. అద్భుతమైన కెరీర్ కోసం నభా పరుగు ఇటీవల స్పీడందుకుంది. దానికి తగ్గట్టే సోషల్ మీడియాల్లో లేటెస్ట్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా నభా షేర్ చేసిన ఫోటోషూట్ ఇంటర్నెట్‌ని షేక్ చేస్తోంది. నభా ఓ ప్రయివేట్ పురస్కారాల్లో స్టైల్ ఐకన్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంలో ఖరీదైన ఫైవ్ స్టార్ హోటల్ ప్రాంగణంలో లైటెనింగ్ కాంతుల్లో నభా ఇచ్చిన ఫోజులు మతులు చెడగొడుతున్నాయి. నభా అల్ట్రా స్టైలిష్ ఫ్రాక్ లో కనిపించింది. బ్లాక్ ఫ్రాక్.. దానికి డిజైనర్ పట్టీ జోడించి నభా నటేష్ లైట్ మేకప్ తో కిల్లర్ లుక్ తో కనిపించింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.




హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 7న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3న విచారణకు రావాలని అరవింద్, బీఎల్ఎన్ రెడ్డికి ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది.

## హైడ్రాకు ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి: కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్: హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైడ్రా వార్షిక నివేదికను రంగనాథ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా చర్యల వల్ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లు, అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఇప్పుడు కొత్తగా ప్లాట్లు, ఫ్లాట్లు కొనేవారు జాగ్రత్తగా ఉంటున్నారని తెలిపారు. "హైడ్రా ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడింది. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువులకు సరిహద్దులు, బఫర్‌జోన్‌లు నిర్ణయిస్తున్నాం. ఎన్ఆర్ఎస్ఈతో సమన్వయం చేసుకుని శాటిలైట్ చిత్రాలు సేకరిస్తున్నాం. ఏరియల్ డ్రోన్ చిత్రాలు కూడా తీసుకుంటాం. ప్రభుత్వ భూములకు జియో ఫెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాం. చెరువులకు సంబంధించి 2000 నుంచి 2024 వరకు ఉన్న చిత్రాలు సేకరిస్తున్నాం. హైడ్రాకు ఇప్పటివరకు 5,800 ఫిర్యాదులు అందాయి. నాలాలకు సంబంధించి కూడా కిర్లోస్కర్‌తో సమన్వయం చేసుకుంటున్నాం. మున్సిపాలిటీల్లో అనధికార నిర్మాణాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. హైడ్రా అంటే.. కేవలం కూల్చేందుకే అన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు కాపాడటమే హైడ్రా ప్రధాన కర్తవ్యం. భూముల రక్షణతో పాటు వరద నివారణ చర్యలు చేపడతాం. హైడ్రాకు డాప్లర్ రాడార్‌ను సమకూర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. డాప్లర్ రాడార్ ఉంటే కచ్చితమైన వాతావరణ అంచనాలు సేకరిస్తాం. హైడ్రా తరఫున తర్వలోనే ఒక ఎఫ్ఎమ్ ఛానెల్ పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నాం. దాని ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలిపేందుకు వీలుంటుంది" అని రంగనాథ్ తెలిపారు.

## బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వండి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్: శుభకార్యాలకు వెళ్లినప్పుడు బొకేలకు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించి మాట్లాడారు. "పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంది. నిరక్షరాస్యుల కోసం ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోంది. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయి.

ఈ-బుక్స్ కంటే పుస్తకాల్లోనే మజా ఉంటుంది. రచయితతో డైరెక్ట్‌గా మాట్లాడుతున్నట్టు ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందే. ఈ-పుస్తకాలు చదివితే ఆ ఫీల్ ఉండదని పలువురు చెబుతున్న మాట. పెద్దలు అందరూ యువతను పుస్తకాల వైపు ప్రోత్సహించాలి" అని గవర్నర్ సూచించారు.

## రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదు.. హరీశ్‌రావు ఎద్దేవా




యువత ముందుకు వచ్చి హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే.. మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని అర్బన్ రెసిడెన్సియల్ బ్రిడ్జి స్కూల్‌లోని విద్యార్థులకు స్వెట్లర్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు. చలికాలంలో హాస్టల్‌లో వేడి నీళ్లు రాక, ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. గత 4 నెలల నుంచి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదని శాసన సభ సాక్షి గా చెప్పారని ప్రస్తావించారు. ఇదేనా గ్రీన్ ఛాలెంజ్ అని ప్రశ్నించారు. జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన మీద పట్టు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుందని చెప్పారు. అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి, తులం బంగారం ఎటు పోయాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారా అని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదా అని నిలదీశారు. తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని నిలదీశారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీ విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300కి పెంచిన మెస్ ఛార్జిలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1,050 మెస్ ఛార్జిలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 7 తరగతి వరకు 1300, ఎనిమిదో తరగతికి రూ.1500 మెస్ ఛార్జిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ ఛార్జిలు ఇంకా 100 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని.. వాటిని150 రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ విషయంలో కూడా మాట నిలుపుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఏ విషయంలోనూ చెప్పిన మాటకు క్షేత్రస్థాయిలో పొంతన లేదని అన్నారు. అసెంబ్లీ లో చెప్పినట్లుగా తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## తండ్రి కోసం పాట పాడిన హిమాన్షు.. గర్వంగా ఉందంటూ కేటీఆర్ ప్రశంసలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మనుమడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షు వివిధ రంగాల్లో తనకు ఉన్న ప్రతిభను ఇప్పటికే చాటుకున్నాడు. అప్పుడప్పుడు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్న హిమాన్షు.. గత ఏడాది ఓ ఇంగ్లీష్ సాంగ్ ( గోల్డెన్ అవర్) ఆలపించి అందర్నీ మెప్పించాడు. తాజాగా తన తండ్రి పట్ల తనకు ఉన్న ప్రేమ, అభిమానాలను చాటుతూ హిమాన్షు రావు ఒక పాటను పాడాడు. నిజానికి కేటీఆర్ బర్త్ డే కానుకగా జూలైలోనే హిమాన్షు ఓ పాటను పాడాడు. యానిమల్ మూవీలోని ' ఓ నాన్న నువ్వు నా ప్రాణం' అనే పాటను రికార్డు చేశాడు. అయితే ఆ పాటను తాజాగా కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పంచుకున్నారు. తన బర్త్ డే కానుకగా తన కొడుకు హిమాన్షు రావు ఈ పాటను పాడాడని పేర్కొన్నారు. కానీ అది సంతృప్తికరంగా రాలేదని భావించి విడుదల చేయలేదని చెప్పారు.

అయితే ఆ పాటను తాను వారం క్రితం మొదటిసారి విన్నానని, హిమాన్షు గానం, పాటలోని సాహిత్యం అద్భుతంగా ఉందని తెలిపారు. ఈ కష్టతరమైన సంవత్సరంలో నాకు దక్కిన ఉత్తమ బహుమతి అని కేటీఆర్ హిమాన్షు పాడిన పాటను ప్రశంసించారు. తన గాత్రంతో ఉత్తమ బహుమతి అందించిన బింకు(హిమాన్షు)కి ధన్యవాదాలు తెలిపారు. ఓ తండ్రిగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు.




చిత్ర పరిశ్రమలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఫిల్మ్ ఛాంబర్ మాజీ అధ్యక్షుడు, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ ప్రెస్‌మీట్ పెట్టారు. తాజాగా సినీ ప్రముఖులు సీఎంను కలవడం గురించి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలపై నటీనటులందరూ వీడియోలు చేయాలని కోరారు. "అందరినీ సమన్వయపరచడానికే ఫిల్మ్ ఛాంబర్ ఉంది. తాజాగా సినీ ప్రముఖులంతా ప్రభుత్వాన్ని కలిశారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ తరఫున వెళ్లారు. ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ వచ్చిందనే అపోహ నిన్నటి మీటింగ్‌తో తొలగిపోయింది. అది బెస్ట్ మీటింగ్ అని అక్కడికి వెళ్లినవాళ్లు నాతో చెప్పారు. ఫిల్మ్ ఛాంబర్ తరఫున మేము గతంలో ప్రభుత్వాన్ని కలిశాం. గద్దర్ అవార్డుల విషయంలో కొన్ని సలహాలిచ్చాం. గతంలో మేము కూడా కొన్ని సినిమాలకు బెనిఫిట్ షోలు వేశాం. కానీ, ఉచితంగా ప్రదర్శించాం. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. దీని గురించి ప్రేక్షకులు, నిర్మాతలు ఆలోచించాలి. తాజాగా విడుదలైన 'పుష్ప2' అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అంటే మనం ఇప్పటికే ఇంటర్నేషనల్ స్థాయికి చేరాం. అన్ని భాషల్లో సినిమాలు తీస్తున్నాం. ప్రేక్షకులను అలరిస్తున్నాం" "తాజాగా జరిగిన మీటింగ్‌లో వాళ్లు సినిమాల గురించి మాట్లాడలేదు. ఇండస్ట్రీ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం కోరడానికి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టే అవగాహన కార్యక్రమాలకు మన హీరోలందరూ సపోర్ట్ చేస్తూనే ఉన్నారు. అది మన డ్యూటీ. మనం సినిమాతో డబ్బులు సొంతం చేసుకుంటున్నప్పుడు సమాజానికి ఎంతోకొంత ఉపయోగపడే వీడియో చేయడం తప్పులేదు. సినిమాల రిలీజ్ సమయంలోనే కాదు ఎప్పుడూ సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూనే ఉండాలని నా అభిప్రాయం. లంచం తీసుకొని టికెట్ ధరలు పెంచారని వచ్చిన వార్తల గురించి ఇండస్ట్రీ ప్రముఖులతో సీఎం మాట్లాడినట్లు సమాచారం. ఇండస్ట్రీ వాళ్లకు గవర్నమెంట్ దగ్గరకు తరచూ వెళ్లాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్యలు ఉన్నప్పుడే కలుస్తాం. పుట్టినరోజుకు శుభాకాంక్షలు చెప్పలేదనేది అసలు విషయమే కాదు.. అందరూ అందరినీ విష్ చేయలేరు కదా" "గతంలో చెన్నై నుంచి ఇండస్ట్రీ హైదరాబాద్ రావడానికి 40 ఏళ్లు పట్టింది. ఇక్కడి నుంచి మరోచోటకు వెళ్లాలన్నా అంత సమయమే పడుతుంది. చిరంజీవి కుటుంబం నుంచి మీటింగ్‌కు ఎవరూ ఎందుకు వెళ్లలేదో నాకు తెలియదు. బహుశా వారికి ఏమైనా ముఖ్యమైన పనులు ఉన్నాయేమో. ఇండస్ట్రీలో ఉన్న వారందరూ నాకు పిల్లలతో సమానం. అల్లు అర్జున్‌కు నేషనల్ అవార్డు వచ్చినప్పుడు సంతోషించాను. అలానే సంధ్య థియేటర్ ఘటనపై కూడా తాజాగా నా అభిప్రాయాన్ని చెప్పాను. నా ఉద్దేశం ఎవరినీ బాధపెట్టడం కాదు. నా పిల్లలతో సమానం కాబట్టి వాళ్ల గురించి మాట్లాడతాను. కొందరి మాట వింటే భవిష్యత్తు బాగుంటుంది. మరి కొందరికి దూరంగా ఉండండి అని చెప్పడానికి ప్రయత్నం చేస్తుంటాను" అని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.




## తెలుగు భాష పలుకుబడి వినసొంపైనది.. సంగీతంలా ఉంటుంది: జస్టిస్ ఎన్వీ రమణ

విజయవాడ: "తెలుగు భాషను కాపాడుకుందాం. ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం అనే నినాదంతో ఐక్యత చాటేందుకు నలుమూలల నుంచి విజయవాడకు తరలివచ్చిన వారందరికీ వందనాలు" అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల ఆరో మహాసభల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. "తెలుగు తల్లి ముద్దుబిడ్డ, మహోన్నత వ్యక్తి, తుది శ్వాస వరకూ తెలుగు భాష, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన యోధుడు రామోజీరావు సభా వేదిక నుంచి మిమ్మల్నందర్నీ చూస్తుంటే.. యావత్ తెలుగు ప్రపంచం నా ముందు సాక్షాత్కరిస్తోంది. విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారు మన సంస్కృతి, భాషను మరిచిపోకూడదని.. తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు నిత్యం వెలుగొందాలని కోరుకునే వ్యక్తిని నేను. తెలుగు భాషను దేశంలో వంద మిలియన్లకు పైగా మాట్లాడతారు. తెలుగుభాష పలుకుబడి వినసొంపైనది. అది సంగీతంలా ఉంటుంది. సామాన్య ప్రజలు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే అందమైన భాష తెలుగు. ఇంత అద్భుతమైన మన తల్లి భాష తెలుగును.. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు" "తెలుగు భాషా, సంస్కృతిని పరిరక్షించుకున్నప్పుడే మనం గొప్పవారమవుతాం. జాతి మనుగడకు, వికాసానికి ధైర్యం కావాలి. భాష లేకపోతే.. ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాథలం, అక్షరం లేని అభాగ్యులం. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి ఉండేలా.. శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సినారెలాంటి గొప్ప కవులు, రచయితలు.. భానుమతి, సూర్యకాంతం, జమున, సావిత్రి, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని, ఎన్టీఆర్, రేలంగి, ఎస్వీఆర్, ఘంటసాల, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి. మీరు గుర్తుంచుకోండి.. మీ పిల్లలకు గుర్తు చేయండి. 'భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితోపాటు.. భాషా సంస్కృతులను మనం రక్షించుకోవాలి" "ఎన్టీఆర్ వల్ల తెలుగు భాషకు.. ప్రజలకు గౌరవం పెరిగింది. ప్రభుత్వ అవార్డులకన్నా.. సమాజాన్ని మేల్కొలిపే రచనలే మిన్న. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు ఆలోచించాలి. పత్రికలు, ఛానళ్లు తెలుగు అభివృద్ధికి పాటుపడాలి. తమిళనాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలి. తెలుగుకు మద్దతిచ్చే వారికే ఓటు అని ప్రజలతో చెప్పించాలి. అలా చెప్పిస్తేనే.. మాతృభాష అభివృద్ధి, వైభవం దక్కుతుంది" అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

## తెలంగాణ సిఫారసు లేఖలపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. టీటీడీ ఈవో కీలక ప్రకటన



తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే సిఫారసు లేఖలను అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందని నిన్నటి నుంచి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తెలంగాణ నాయకుల విజ్ఞప్తి మేరకు వారానికి రెండు సార్లు సిఫారసు లేఖలను టీటీడీ అనుమతిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే అవన్నీ పుకార్లు మాత్రమేనని టీటీడీ ఈవో శ్యామల రావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలతో శ్రీవారి దర్శనానికి టీటీడీ అనుమతించిందనే వార్తలను ఈవో శ్యామల రావు ఖండించారు. ఈ అంశంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడంపై కొద్దిరోజులుగా చర్చ జరుగుతోంది. తెలంగాణలోని యాదగిరిగుట్ట, ఇతరత్రా దేవస్థానాల్లో ఏపీ ప్రజాప్రతినిధులకు విశిష్ట గౌరవం దక్కుతుందని.. కానీ ఏపీలో మాత్రం తమకు అటువంటి గౌరవం దక్కడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ తీరును బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు సైతం తప్పుబట్టారు. ఇలా తెలంగాణ ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న వ్యతిరేకత దృష్ట్యా ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలను అనుమతించడంపై టీటీడీ పునఃపరిశీలించనుందని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతిస్తూ టీటీడీ నిర్ణయం తీసుకుందని ఒక వార్త వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన టీటీడీ ఈవో శ్యామలరావు .. అదంటా వట్టి పుకార్లేనని క్లారిటీ ఇచ్చారు.

## విద్యుత్ భారాల పాపం జగన్ రెడ్డిదే.. మంత్రి పార్థసారథి విసుర్లు

అమరావతి: విద్యుత్ భారాల పాపం వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిదే అని పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. గత ఐదేళ్లతో విద్యుత్ ఉత్పత్తి సంస్థలను జగన్ రెడ్డి నిర్వీర్యం చేశారని విమర్శించారు. విద్యుత్ కొనుగోలు పేరుతో హిందూజాకు రూ.1400 కోట్లు ముట్టజెప్పి... కేపీహెచ్‌బీలో 10 ఎకరాలు జగన్ బినామీలు కొట్టేశారని ఆరోపించారు. విద్యుత్ రంగంలో రూ.50 వేల కోట్లు జగన్ అప్పులు పెట్టారని విమర్శించారు. ఒక్క విద్యుత్ రంగంలోనే జగన్ మోహన్ రెడ్డి రూ.1,29,500 కోట్లు నష్టాన్ని పెట్టి వెళ్లారని అన్నారు. 2014 %-% 2019లో చంద్రబాబు పాలనలో మిగులు విద్యుత్ ఉత్పత్తి చేసి జగన్ చేతిలో పెట్టి వెళ్లారని మండిపడ్డారు. ఏపీని లోటు విద్యుత్ నుంచి మిగులు విద్యుత్‌గా సీఎం చంద్రబాబు మార్చారని అన్నారు. పోలవరం 2021లో పూర్తి చేసి ఉంటే విద్యుత్ ఆదా అయ్యేదని తెలిపారు. హిందూజాకు రూ.1400 కోట్లు జగన్ అప్పనంగా ఇచ్చారని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. కాకినాడ జిల్లా: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్లలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని పిఠాపురం టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు. జగన్ అవినీతి మూలంగా రాష్ట్ర విద్యుత్ సంస్థలపై రూ. 1.29 వేల కోట్ల భారం పడిందని అన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు వల్ల ప్రజలపై రూ. 32 వేల 166 కోట్లు భారం పడిందన్నారు. విద్యుత్ సంస్థల కోసం రూ.49 వేల కోట్లు అప్పు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనని ఆరోపించారు. జెన్కో విద్యుత్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి తగ్గించడం వల్ల రూ. 3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అన్నారు. 2023, 24 సంవత్సరాల్లో జగన్ పెంచిన విద్యుత్ చార్జీలే ఇప్పుడు పెరిగాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వమేదో విద్యుత్ చార్జీలు పెంచినట్లుగా వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని వర్మ విమర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com